జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

కృష్ణ బుధవారం 24 జూన్ 2026 సంపుటి : 01 సంచిక :160 పేజీలు : 12 వెల : 3/- PRGI No. APTEL/26/A0119,
శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం : జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, సూర్య చంద్రుల సమయాలు, సూర్యోదయం : 5:27 సూర్యాస్తమయం : 6:31 , చంద్రోదయం: 1:07 చంద్రాస్తమయం : 1:07 పంచాంగం తిథి : శుద్ధ నవమి రా. 7:32 వరకు, [illegible] దశమి, నక్షత్రం : హస్త మ. 3:22 వరకు, తర్వాత చిత్త, యోగం : వరీయాన్ మ. 2:06 వరకు, తర్వాత పరిఘ, కరణం: బాలవ ఉ. 7:31 వరకు, తర్వాత కౌలవ రా. 7:32 వరకు, తర్వాత తైతుల
Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# ఉద్యోగులపై వరాల జల్లు..

- భారీ పెట్టుబడులకు ఆమోదం...
- ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు
- ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు.. రూ.39,355 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- రాష్ట్రంలో 34,610 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్
- అమరావతి పనుల వేగవంతం.. మౌలిక వసతులకు టెండర్లకు ఆమోదం
- కొందరు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం.. పీఎస్‌యూల్లో రిటైర్మెంట్ వయసు 62కి పెంపు
- మచిలీపట్నం, రామయ్యపట్నం పోర్టుల పరిధుల క్రమబద్ధీకరణ, పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు



**అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడం, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, పర్యాటక రంగం అభివృద్ధి వంటి అంశాలపై క్యాబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశానంతరం తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ సిఫారసు చేసిన పలు ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. మొత్తం రూ.39,355 కోట్ల పెట్టుబడులతో, 34,610 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. - మిగతా3లో




## డేటా సెంటర్లకు నిరంతర విద్యుత్

- భారీ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ ఏర్పాటు
- ఉత్తరాంధ్రను అతిపెద్ద డేటా సెంటర్ కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం అడుగులు
- నిరంతర విద్యుత్ అందించేందుకు భారీ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్
- 2034 నాటికి 15 గిగావాట్ల విద్యుత్ సరఫరా సామర్థ్యం తీసుకురావడమే లక్ష్యం

**అమరావతి**

ఉత్తరాంధ్రను దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. విశాఖపట్నం ప్రాంతంలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు భారీ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. 2034 నాటికి 15 గిగావాట్ల విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవల విస్తరణతో - మిగతా3లో



## రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం

- రాజేంద్రప్రసాద్, మురళీమోహన్, రోహిత్‌కు అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి
- ప్రముఖ మలయాళ జర్నలిస్ట్ పి. నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.టి. థామస్‌కు పద్మవిభూషణ్
- క్రికెటర్ రోహిత్ శర్మ, సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ , మాధవన్‌కు పద్మశ్రీ అవార్డులు

## ఉగ్రవాదం, సైబర్ ముప్పులపై ఉక్కుపాదం

- బ్రిక్స్ దేశాలకు ప్రధాని మోదీ కీలక సందేశం
- బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారులతో సమావేశమైన ప్రధాని మోదీ
- ఉగ్రవాదం, సైబర్ భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలని వ్యాఖ్యలు
- 2026లో బ్రిక్స్ కూటమికి భారతదేశం అధ్యక్షత వహిస్తోంది
- గతంలో 2012, 2016, 2021 లలో కూడా అధ్యక్షత వహించగా ఇది నాలుగోసారి.





## వడ్డెరలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం

- క్వారీల్లో వడ్డెరలకు 33 శాతం కేటాయిస్తామని యువగళం సమయంలో లోకేశ్ హామీ
- వడ్డెరలకు 33 శాతం కేటాయిస్తూ జీవో జారీ చేసిన ప్రభుత్వం
- తమది చేతల ప్రభుత్వం అన్న లోకేశ్

**అమరావతి**

వడ్డెర సామాజికవర్గానికి క్వారీల్లో 33 శాతం వాటా కేటాయించాలని యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చుతూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వడ్డెరలకు 33 శాతం వాటా కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, - మిగతా3లో



## సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు

- సింధూ జలాల వివాదంపై పాక్‌కు భారత్ గట్టి కౌంటర్
- పీఓకేలో ఆందోళనల వెనక భారత్ హస్తం ఉందన్న వ్యాఖ్యలను తోసిపుచ్చిన భారత్
- పాక్ అనుసరిస్తున్న విధానాలే పీఓకేలో ఆందోళనలకు కారణమని వ్యాఖ్య
- దోపిడీ, అణచివేతకు పాల్పడటం వల్లే ప్రజలు రోడ్లపైకి వస్తున్నారన్న రణధీర్ జైస్వాల్

# లక్షల్లో ఫీజులు

- తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా పిల్లల చదువులు
- శాస్త్రీయ ప్రాతిపదిక లేకుండా ఏటా ఇష్టానుసారంగా ఫీజుల పెంపు
- తల్లిదండ్రులకు భారంగా మారుతున్న పిల్లల విద్య
- కొన్ని ప్రముఖ పాఠశాలల భారీ విరాళాల డిమాండ్




**అమరావతి**

ఈ రోజుల్లో పిల్లల చదువులు తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా మారిపోయాయి. విద్యావ్యవస్థ క్రమంగా వ్యాపారీకరణ వైపు అడుగులు వేయడంతో, ఎల్‌కేజీ నుంచే ఫీజులు లక్షల రూపాయలు దాటుతున్నాయి. కేవలం ట్యూషన్ ఫీజులే కాకుండా డొనేషన్లు, ట్రాన్స్‌పోర్ట్, పుస్తకాలు , స్కూల్ యాక్టివిటీస్ పేరుతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రులను తీవ్రంగా దోచుకుంటున్నాయి. మధ్యతరగతి పేద కుటుంబాల ఆదాయం పెరగడం లేదు కానీ, విద్యా ఖర్చులు మాత్రం ప్రతి ఏటా రెట్టింపు అవుతున్నాయి. దీంతో తమ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఆరాటంతో తల్లిదండ్రులు అప్పుల పాలు కావాల్సి వస్తోంది. తమ సొంత అవసరాలు, ఆరోగ్య ఖర్చులు, రిటైర్మెంట్ ప్లాన్స్‌ను సైతం త్యాగం చేస్తూ కేవలం ఫీజులు కట్టడానికే జీవితాంతం కష్టపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన వసతులు లేకపోవడం, - మిగతా3లో

# ఉగ్రవాదం, సైబర్ ముప్పులపై ఉక్కుపాదం



బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారులు సీనియర్ భద్రతా అధికారులతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రోజు సమావేశమయ్యారు. మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో ఉగ్రవాదం, సైబర్ భద్రత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో ఏర్పడుతున్న సవాళ్లను ఎదుర్కోవడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. సమావేశం అనంతరం సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో స్పందించిన మోదీ- బ్రిక్స్ దేశాల మధ్య భద్రతా సహకారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. టెర్రరిజం సహా సైబర్ దాడులు, ఇతర అన్ని రకాల సవాళ్లను ఎదుర్కొనేందుకు సభ్య దేశాలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. న్యూ దిల్లీ వేదికగా భారత జాతీయ భద్రతా సలహాదారు (చీూూ) అజిత్ డోభాల్ అధ్యక్షతన జరిగిన '16వ బ్రిక్స్ ఎన్ఎస్ఏ సమావేశం' విజయవంతమైంది. ఈ సదస్సుకు హాజరైన బ్రిక్స్ సభ్యదేశాల ఎన్ఎస్ఏలు, ఉన్నత స్థాయి భద్రతా అధికారుల బృందం ఆ తర్వాత మోదీతో సమావేశమైంది. ఈ సందర్భంగానే పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. 2026లో బ్రిక్స్ కూటమికి భారతదేశం అధ్యక్షత వహిస్తోంది. గతంలో 2012, 2016, 2021 లలో కూడా అధ్యక్షత వహించగా ఇది నాలుగోసారి. ఇక ఈసారి రెసిలెన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్, సస్టైనబులిటీ (స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత) అనే థీమ్‌తో భారత్ ముందుకు సాగుతోంది. అంటే ఈ ఇతివృత్తం ద్వారా సహకారం, ఆవిష్కరణలు, స్థిరత్వం, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ సంవత్సరం భారత నాయకత్వంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, గ్లోబల్ సౌత్ దేశాల ప్రాధాన్యతలకు పూర్తి మద్దతు ఇవ్వడం వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయని మోదీ చెప్పారు. మరింత సురక్షితమైన, సమగ్రమైన ప్రపంచ నిర్మాణానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని స్పష్టం చేశారు. ఇక దిల్లీలో జరిగిన సమావేశానికి బ్రెజిల్, చైనా, రష్యా, సౌతాఫ్రికా, ఈజిప్ట్, యూఏఈ, ఇరాన్, ఇండోనేసియా, ఇథియోపియా, సౌదీ అరేబియా తదితర దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. బ్రిక్స్ చీూూ సదస్సుకు నేతృత్వం వహించిన భారత ఎన్ఎస్ఏ అజితే డోభాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ అనేది ప్రపంచంలోనే అత్యంత విశిష్టమైన, ప్రత్యేకమైన కూటమి అని అభివర్ణించారు. ప్రస్తుతం ప్రత్యేక ప్రాధాన్యం కలిగిన వేదికగా ఎదిగిందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలు ప్రపంచ రాజకీయ, ఆర్థిక, భద్రతా వ్యవస్థల్లో మరింత కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకున్నాయని వ్యాఖ్యానించారు.

### 11 సభ్యదేశాల ప్రతినిధులు హాజరు

ఈ బ్రిక్స్ ఉన్నత స్థాయి సదస్సులో బ్రిక్స్ కూటమిలోని 11 ప్రధాన సభ్యదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ, దక్షిణాఫ్రికా మంత్రి ఖుంబుజో, యూఏఈ జాతీయ భద్రతా మండలి ప్రధాన కార్యదర్శి అలీ మొహమ్మద్ అల్ షంసీ, రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగూతో పాటు ఈజిప్ట్, ఇథియోపియా, బ్రెజిల్, ఇరాన్, ఇండోనేసియా దేశాలకు చెందిన అత్యున్నత రక్షణ, భద్రతా అధికారులు హాజరయ్యారు. సమావేశంలో సరిహద్దు భద్రత, ఆహార ఇంధన భద్రత, వాతావరణ మార్పులపై సుదీర్ఘంగా చర్చించారు.

### బ్రిక్స్ కూటమి దేశాలివే

బ్రిక్స్ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న 4 ప్రధాన దేశాల కూటమిగా మొదలైంది. ముందుగా బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాతో దీ=×జ గా ఏర్పడగా తర్వాత సౌతాఫ్రికా చేరడంతో దీ=×జూ గా మారింది. ఇటీవలి కాలంలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఇండోనేసియా వంటి కొత్త దేశాలు ఈ కూటమిలో అధికారికంగా చేరాయి. దీంతో ప్రస్తుతం మొత్తం 11 సభ్య దేశాలుగా ఉన్నాయి. థాయిలాండ్, వియత్నాం, మలేసియా సహా మరికొన్ని దేశాలు భాగస్వామ్య దేశాల హోదాలో చేరాయి.

# రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం



రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో అసాధారణ, విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. సాహిత్యం, విద్యా రంగానికి చేసిన విశేష సేవలకు గాను ప్రముఖ మలయాళ జర్నలిస్ట్ పి. నారాయణన్‌కు 'పద్మవిభూషణ్'ను ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.టి. థామస్ పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు.

### శిబు సోరెన్‌కు పద్మభూషణ్ అవార్డు

ప్రవాస భారతీయుడు, ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ దత్తాత్రేయుడు నోరి పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. ఝార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకుడు, దివంగత నేత శిబు సోరెన్‌కు ప్రకటించిన పద్మభూషణ్ అవార్డును ఆయన సతీమణి రూపీ సోరెన్ రాష్ట్రపతి నుంచి అందుకున్నారు. కళారంగానికి చేసిన సేవలకు గాను ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి, బాలీవుడ్ నేపథ్య గాయని అల్కా యాగ్నిక్‌లు పద్మభూషణ్ అందుకున్నారు. అలాగే, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. సినీనటుడు =. మాధవన్ పద్మశ్రీ అందుకున్నారు. వీరితోపాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు.

### రామారెడ్డి మామిడికి మరణానంతరం పద్మశ్రీ

ఇక, శాస్త్రవేత్త చంద్రమౌళి గడ్డమనుగుకు రాష్ట్రపతి ముర్ము పద్మశ్రీ అవార్డు అందజేశారు. డెయిరీ విభాగంలో రామారెడ్డి మామిడికి మరణానంతరం పద్మశ్రీ ప్రకటించగా కుటుంబ సభ్యులు స్వీకరించారు. ప్రసార భారతి మాజీ సీఈఓ, 'డీప్ టెక్ ఫర్ భారత్ ఫౌండేషన్' సహ వ్యవస్థాపకులు శశి శేఖర్ వెంపటి 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నారు.

ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 5 పద్మవిభూషణ్‌లతో కలిపి మొత్తం 131 పద్మ అవార్డులను ప్రకటించింది. ఇందులో మే 25న జరిగిన తొలి విడత కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 65 మందికి పద్మ అవార్డులను ప్రదానం చేశారు. మిగిలిన వారికి ఇవాళ జరిగిన రెండో విడత అవార్డుల కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

### అవార్డు రావడంపై ఆనందం వ్యక్తం చేసిన పలువురు


ఇదిలా ఉండగా, పద్మ అవార్డులు రావడంపై పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. లద్దాఖ్?లోని సుదూర ప్రాంతానికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోవా-రిగ్పా డైరెక్టర్ డాక్టర్ పద్మ గుర్మెట్‌కు పద్మశ్రీ అవార్డు వరించింది. హిమాలయ సాంప్రదాయ వైద్య విధానాన్ని పరిరక్షించడం, ప్రచారం చేయడంలో ఆయన చేసిన కృషికి గాను ఈ గౌరవం దక్కింది. అయితే, లద్దాఖ్? వంటి మారుమూల ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఈ అవార్డు దక్కడం తనకే కాకుండా మొత్తం సోవా-రిగ్పా సమాజానికి దక్కిన గొప్ప గౌరవమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

### 320 పాఠశాలలు, కళాశాలల స్థాపన

మరొక పద్మశ్రీ గ్రహీత, కర్ణాటక లింగాయత్ ఎడ్యుకేషన్? సొసైటీ ఛైర్మన్? డాక్టర్ ప్రభాకర్ బసప్రభు కోరే బెళగావి జిల్లాకు చెందినవారు. "గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలు లేని పిల్లల కోసం గత 42 ఏళ్లుగా సేవలందిస్తున్నా. దాదాపు 320 పాఠశాలలు, కళాశాలలను స్థాపించాం. మా విద్యాసంస్థల్లో సుమారు 1.48 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు" అని ప్రభాకర్? తెలిపారు. వీటితో పాటు ఇంకా ఎన్నో కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. అయితే, తాను సేవలను గుర్తించి అవార్డు ప్రధానం చేయడంతో ప్రభాకర్? ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, భారత ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

# సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు

పాకిస్థాన్ జల భద్రతకు ముప్పు వాటిల్లితే భారత్‌పై యుద్ధానికి దిగుతామని పాకిస్థాన్ రక్షణ మంత్రి చేసిన వ్యాఖ్యలకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. పాకిస్థాన్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడంతో పాటు మానవ హక్కుల ఉల్లంఘనల నుంచి అంతర్జాతీయ దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి ఆరోపణలు చేస్తోందని విమర్శించింది. అలాగే, పాక్ అక్రమిత కశ్మీర్?లో జరుగుతున్న ఆందోళనల వెనక భారత్ హస్తం ఉందన్న వ్యాఖ్యలను కూడా భారత్? తోసిపుచ్చింది. పాక్ అనుసరిస్తున్న విధానాలే పీఓకేలో ఆందోళనలకు కారణమని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా అక్కడి ప్రజలను ఆర్థికంగా పాకిస్థాన్ దోపిడీ చేయడంతో పాటు, పరిపాలనాపరమైన అణచివేతకు పాల్పడటం వల్లే ప్రజలు రోడ్లపైకి వస్తున్నారని జైస్వాల్? పేర్కొన్నారు. నిరసనలను అణచివేసేందుకు నిరాయుధులైన పౌరులపై ఆయుధాలను ప్రయోగించడం, తీవ్రమైన పోలీసు దౌర్జన్యాలకు పాల్పడటం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పాక్ రక్షణ మంత్రి ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలని, అంతర్గత వైఫల్యాల నుంచి దృష్టి మరల్చే ప్రయత్నమేనని రణధీర్ జైస్వాల్ కొట్టిపారేశారు. మరోవైపు, పాకిస్థాన్ ప్రభుత్వం అక్కడి ప్రజలపై అమానుష చర్యలకు పాల్పడుతోందని విదేశాంగ శాఖ ఆరోపించింది. నిత్యావసర వస్తువులు, ఔషధాల సరఫరాను అడ్డుకోవడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, నిరాయుధ పౌరులపై ప్రాణాంతక బలప్రయోగం చేయడం వంటి చర్యలను తీవ్రంగా విమర్శించింది. అయితే, ఈ చర్యల కారణంగా ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారని జైస్వాల్ ఆరోపించారు.



### భారత్‌పై పాక్ రక్షణ మంత్రి వ్యాఖ్యలు

గత శనివారం పాకిస్థాన్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ జాతీయ భద్రతకు ముప్పు ఏర్పడిందని భావిస్తే, భారత్‌తో యుద్ధానికి వెనుకాడబోమని వ్యాఖ్యానించారు. భారత్ తమ నీటి వనరులను అడ్డుకునే చర్యలను వేగవంతం చేస్తోందని నిర్ధారణ అయితే సైనిక చర్యలను కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. చెనాబ్ నదిపై నీటి ప్రవాహాన్ని భారత్ నియంత్రిస్తోందని, అలాగే, నదీ ప్రవాహాలకు సంబంధించి ఎలాంటి సమాచారం పంచుకోవడం లేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా, పశ్చిమాసియా పరిస్థితుల గురించి కూడా రణధీర్ జైస్వాల్ మాట్లాడారు. "ఆంక్షలు, ఇతర ఇటీవలి పరిణామాల విషయానికి వస్తే, మేం పశ్చిమ ఆసియాకు సంబంధించిన అన్ని పరిణామాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ఇంధన వనరుల విషయానికొస్తే, మా విధానం జాతీయ ప్రయోజనాలకే నిర్దేశించింది. 140 కోట్ల మంది ప్రజలకు సరసమైన ధరలకు ఇంధనం అందుబాటులో ఉండేలా చూడటమే మా బాధ్యత. ఇటీవల, అమెరికా, ఇరాన్? మధ్య అవగాహన ఒప్పందం కుదిరిన తర్వాత హర్మూజ్? జలసంధి గుండా నౌకల రాకపోకలు సజావుగా సాగుతున్నాయి. ఇటీవలి కాలంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)తో కూడా సంబంధాలు బలపడ్డాయి. ఇందులో రక్షణ భాగస్వామ్యం కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఇటీవలి కాలంలో రక్షణ భాగస్వామ్యం మరింత బలోపేతం అయ్యింది" అని రణధీర్ పేర్కొన్నారు. ఇక, ఖతార్‌లోని రస్ లఫాన్ పారిశ్రామిక నగరంలోని గ్యాస్‌క్షేత్రంలో జరిగిన పేలుడు ఘటనలో 12 మంది భారతీయులు మృతి చెందడంపై? రణధీర్ జైస్వాల్ సంతాపం వ్యక్తం చేశారు. భారతీయులతో పాటు మిగతా దేశాలకు చెందినవారు కూడా చనిపోవడం విచారకరమన్నారు. అయితే, చనిపోయిన భారతీయులను గుర్తించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, అలాగే, వారి మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడానికి స్థానిక అధికారులతో చర్చలు జరుపుతున్నామని? పేర్కొన్నారు. మృతుల కుటుంబాలతోనూ సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. అయితే, గాయపడ్డవారిలో ఎంతమంది భారతీయులు ఉన్నారనేది ఇంకా స్పష్టంగా తెలియదని ఆయన చెప్పారు.

## 'డైపర్ విరాళాల కార్యక్రమం' ప్రకటించిన సీజేపీ



నీట్- యూజీ పేపర్ లీక్ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వినూత్న కార్యక్రమం చేపట్టింది. ఇప్పటికే దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన సీజేపీ, మంగళవారం "డైపర్ విరాళాల కార్యక్రమం" ప్రకటించింది. మంగళవారం సాయంత్రం చేపట్టనున్న 'డైపర్ ఎ డే కీప్స్ లీక్స్ అవే' ప్రచారంలో పాల్గొనాలని తమ మద్దతుదారులకు విజ్ఞప్తి చేశారు. నిరసన స్థలానికి డైపర్లు తీసుకువచ్చి వాటిపై ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను రాయాలని కోరారు. "ఒక డైపర్ తీసుకురండి. దానిపై ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను రాయండి. అది విద్యాశాఖ మంత్రికి చేరేలా మేము చూసుకుంటాము." అని సీజేపీ పేర్కొంది. ఇదిలా ఉండగా, నిరసన ప్రాంతాన్ని కుదించేందుకు పోలీసులు ప్రయత్నించారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. పేపర్ లీకుల్లో పాల్గొన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోకుండా, విద్యార్థులను శిక్షిస్తున్నారని ఆరోపించారు. సోమవారం రాత్రి దిల్లీ పోలీసులు బారికేడ్లను తొలగించి, నిరసన స్థలాన్ని చిన్న ప్రాంతానికి కుదించేందుకు ప్రయత్నించారని అన్నారు. కాగా, ఈ ఆరోపణలపై దిల్లీ పోలీసుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. నీట్ వివాదంతో సహా పేపర్ లీకులు, పరీక్షా అవకతవకలపై జవాబుదారీతనం కోరుతూ సీజేపీ ఆందోళనలు చేపట్టింది. ఈ క్రమంలోనే విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు నిరసన కొనసాగుతుందని ఆ పార్టీ స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే శనివారం నుంచి దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తోంది. మంగళవారం నాటికి ఈ నిరసన నాలుగో రోజుకు చేరుకుంది. పేపర్ లీక్ వివాదం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల స్మృతిగా నిరసన ప్రదేశంలో కొవ్వొత్తులు వెలిగించారు. ఈ నిరసనలో విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు జంతర్ మంతర్ వద్ద సీజేపీ చేపట్టిన ఆందోళనలో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. ఆధార్, పాన్ కార్డుల తనిఖీ విషయంలో పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు దిల్లీ పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. నిరసన స్థలానికి వచ్చేవారిని ఆధార్, పాన్ కార్డులను చూపించాలని అడ్డుకుంటున్నారని దీప్కే ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య హక్కులకు సంబంధించిన అంశమని, ప్రజలను అనవసరమైన వేధింపులకు గురిచేయకూడదని అన్నారు. గత మూడు రోజులుగా తాము ఎటువంటి ఇబ్బందులూ కలిగించకుండా శాంతియుతంగా కూర్చున్నామని గుర్తు చేశారు. నిరసనల్లో పాల్గొనేవారు నిరంతరం శాంతిభద్రతలను పాటిస్తూ పోలీసులకు సహకరిస్తున్నారని చెప్పారు. అయినా, బారికేడ్ల వద్ద ప్రజలను ఆపి గుర్తింపు పత్రాలను అడగడం ఆశ్చర్యకరమని తెలిపారు. నిరసన ప్రదేశానికి ప్రజలు తాగునీరు, ఆహారం తీసుకువస్తున్నారని దీప్కే గుర్తుచేశారు. అక్కడ ఎటువంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరగనప్పుడు, నీరు తెచ్చేవారిని ఆధార్, పాన్ కార్డులు ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించారు. "ప్రజలు కేవలం నీరు, ఆహారం, ఇతర నిత్యావసరాలను మాత్రమే తీసుకువస్తున్నారు. నీరు వస్తోంది, ఆహారం వస్తోంది. చివరకు 'రాజ్మా-చావల్' కూడా తీసుకువస్తున్నారు. మాదకద్రవ్యాలు లేదా చట్టవిరుద్ధమైన వస్తువులేమీ రవాణా చేయడం లేదు కదా. కాబట్టి, ప్రజలను వారి ఆధార్, పాన్ కార్డులు అడగాల్సిన అవసరం ఏముంది?" అని దీప్కే ప్రశ్నించారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ఎందుకు సేకరిస్తున్నారని దీప్కే ప్రశ్నించారు. ఆధార్ కార్డుతో వ్యక్తిగత వివరాలను తెలుసుకోవచ్చని, కాబట్టి ఇది వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశమన్నారు. జంతర్ మంతర్ అనేది దేశంలో ప్రజాస్వామ్యయుత నిరసనలకు వేదిక అని, అక్కడికి వెళ్లడానికి ఎటువంటి వీసా అవసరం లేదని అభిజిత్ దీప్కే అన్నారు. పౌరులకు తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే హక్కు ఉందని, దానిని గౌరవించాలని చెప్పారు.

## సైనికుల కోసం స్వదేశీ వీల్‌చైర్లు

దేశ రక్షణ కోసం సేవలందించిన సైనికుల పునరావాసానికి తోడ్పడే మరో కీలక కార్యక్రమానికి ఐఐటీ మద్రాస్ శ్రీకారం చుట్టింది. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన 'వైడీ వన్' ('ఔ ూఅవ) అల్ట్రా-లైట్ వెయిట్ వీల్‌చైర్లను దిల్లీలోని ఆర్మీ హాస్పిటల్ (రిసెర్చ్ అండ్ రిఫరల్)కు ఆదివారం అధికారికంగా అందజేసింది. ఈ కార్యక్రమం కింద మొత్తం 100 వీల్‌చైర్లను అందించనున్నారు. అందులో తొలి విడతగా 25 వీల్‌చైర్లు అందజేయగా, మిగిలిన 75 వీల్‌చైర్లను రానున్న నెలల్లో దశలవారీగా సరఫరా చేయనున్నట్లు ఐఐటీ మద్రాస్ వెల్లడించింది. ఈ వీల్‌చైర్లు సాధారణంగా ఆసుపత్రుల్లో ఉపయోగించే సంప్రదాయ వీల్‌చైర్లలా కాకుండా, వినియోగదారులు స్వయంగా నడిపించుకునేలా రూపొందించారు. దీంతో ఆ వ్యక్తులు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా కదిలే అవకాశం ఉంటుంది. 'వైడీ వన్' వీల్‌చైర్లను ఐఐటీ మద్రాస్‌లోని టీటీకే సెంటర్ ఫర్ రిహాబిలిటేషన్ రీసెర్చ్ అండ్ డివైస్ డెవలప్‌మెంట్ (ఆర్2డీ2) అభివృద్ధి చేసింది. ఐఐటీ మద్రాస్ ఇంక్యుబేషన్ సంస్థ అయిన థ్రైవ్ మొబిలిటీ ఈ వీల్‌చైర్ల తయారీ బాధ్యతలు చేపట్టింది. నాణ్యతలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ, దిగుమతి చేసుకునే వీల్‌చైర్లతో పోలిస్తే తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకొచ్చారు.

### ఫిసర్వ్ సీఎస్ఆర్ నిధులతో ప్రత్యేక కార్యక్రమం

ఐఐటీ మద్రాస్‌లో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా, థ్రైవ్ మొబిలిటీలో హెడ్ ఆఫ్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్స్‌గా పనిచేస్తున్న అడ్మిరల్ దీపక్ బన్సల్ (రిటైర్డ్) ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, సైనిక వ్యవస్థల మధ్య సమన్వయం పెంచి, అత్యవసరంగా అవసరమైన వారికి స్వదేశీ సహాయక సాంకేతికతలు అందేలా కృషి చేశారు. ప్రపంచవ్యాప్తంగా చెల్లింపులు, ఆర్థిక సాంకేతిక సేవలు అందిస్తున్న ఫిసర్వ్? సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ఈ ప్రాజెక్టు అమలవుతోంది. స్వదేశీ పరిశోధన, సామాజిక బాధ్యత, సైనికుల పునరావాస అవసరాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన కార్యక్రమంగా దీనిని భావిస్తున్నారు.

### 'పరిశోధన నుంచి ప్రజల అవసరాలకు'

ఈ సందర్భంగా ఆర్మీ హాస్పిటల్ (ఆర్అండ్ఆర్) కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ అవినాశ్ దాస్ మాట్లాడుతూ, కదలిక అనేది వ్యక్తి గౌరవం, స్వాతంత్ర్యానికి మూలాధారమని అన్నారు. భారత్?లోనే రూపొందించిన ఈ వీల్?చైర్ల వల్ల కొంతమంది కుటుంబాలు స్వతంత్రంగా జీవించేందుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సహకారాన్ని తాము స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఐఐటీ మద్రాస్ అధ్యాపకులు, ఆర్2డీ2 కేంద్రానికి చెందిన ప్రొఫెసర్ మణీశ్ ఆనంద్ మాట్లాడుతూ, దేశీయ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి సహాయక పరికరాలను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. తమ పరిశోధన ప్రయోగశాలలకే పరిమితం కాకుండా దేశానికి సేవ చేసిన సైనికులకు ఉపయోగపడుతుండటం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఫిసర్వ్ సీఎస్ఆర్ మద్దతుతో ఈ కార్యక్రమాన్ని పెద్ద స్థాయిలో అమలు చేయగలుగుతున్నామని ఆయన తెలిపారు. ఫిసర్వ్ గ్లోబల్ సర్వీసెస్ అధ్యక్షుడు సచిన్ కులకర్ణి మాట్లాడుతూ, సమాజానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. భారత సాయుధ దళాల కోసం స్వదేశీ మొబిలిటీ పరిష్కారాలను అందించడంలో ఐఐటీ మద్రాస్‌తో భాగస్వామ్యం కావడం గర్వకారణమని పేర్కొన్నారు. థ్రైవ్ మొబిలిటీ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు జస్టిన్ జెసుదాస్ మాట్లాడుతూ, భారతీయ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఈ వీల్‌చైర్‌ను రూపొందించామని, ఇప్పుడు అది సాయుధ దళాల సిబ్బందికి చేరడం తమ ఉత్పత్తి లక్ష్యానికి గొప్ప గుర్తింపని చెప్పారు. ఐఐటీ మద్రాస్‌లోని టిటికె సెంటర్ ఫర్ రిహాబిలిటేషన్ రీసెర్చ్ అండ్ డివైస్ డెవలప్‌మెంట్ (ఆర్2డీ2) తక్కువ ధరలో ప్రపంచ స్థాయి సహాయక సాంకేతిక పరికరాల అభివృద్ధికి కృషి చేస్తోంది.

# ఉద్యోగులపై వరాల జల్లు..

-మొదటిపేజీ తరువాయి

ఇందులో భాగంగా ఏర్పాటు చేయనున్న కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు:

ప్రీమియర్ ఎనర్జీస్ (తిరుపతి): రూ.3,936 కోట్ల పెట్టుబడితో సిలికాన్ వేఫర్, మాడ్యూల్ తయారీ యూనిట్. 540 మందికి ఉపాధి.

కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ (అనకాపల్లి): రూ.2,788 కోట్ల పెట్టుబడితో 1000 మెగావాట్ల డేటా సెంటర్.

ప్రొటేరియల్ ఇండియా (అనకాపల్లి): రూ.2,250 కోట్ల పెట్టుబడితో నియోడిమియం ఐరన్ బోరాన్ మాగ్నెట్ తయారీ పరిశ్రమ. 530 మందికి ఉపాధి.

ఇండియా (కాకినాడ): రూ.1,900 కోట్ల పెట్టుబడితో వాడిన వంట నూనెల నుంచి విమాన ఇంధనం తయారు చేసే యూనిట్. 2,500 మందికి ఉపాధి.

ఎన్ఎస్ మాగ్నటెక్ (తిరుపతి): రూ.1,250 కోట్ల పెట్టుబడితో రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ తయారీ. 400 మందికి ఉపాధి.

ఏపీ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (ప్రకాశం): రూ.1,230 కోట్లతో స్టీల్ బెనిఫికేషన్ ప్లాంట్.

వీటితో పాటు రేర్ ఎర్త్ మెటల్స్ వెలికితీత, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికంగా ఎండ్-టు-ఎండ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**అమరావతికి జవసత్వాలు**

ఐదేళ్లుగా నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది.

అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ కోసం గతంలో టాబ్రీడ్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 35,000 టన్నుల సామర్థ్యంతో కొత్త వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం.

ల్యాండ్ పూలింగ్ రైతులకు కేటాయించిన ప్లాట్లలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులకు సంబంధించిన టెండర్లకు ఆమోదం.

రైతుల ప్లాట్ల సరిహద్దుల వివాదాలను పరిష్కరించేందుకు అవసరమైన రెక్టిఫికేషన్ డీడ్‌లపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి మినహాయింపు.

పనుల పర్యవేక్షణ కోసం ఏపీసీఆర్‌డీఏలో 95 తాత్కాలిక పోస్టుల (డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు) మంజూరు.

ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణానికి రూ.130.38 కోట్లకు టెండర్ ఆమోదం.

**ఉద్యోగులకు శుభవార్త**

ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లపై క్యాబినెట్ సానుకూలంగా స్పందించింది. 2004కు ముందు నోటిఫికేషన్ పొంది, ఆ తర్వాత నియామకం అయిన 2003 డీఎస్సీ టీచర్లు, 10/99 గ్రూప్-1 ఉద్యోగులు సహా మొత్తం 10,715 మంది సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది.

షెడ్యూల్ 9, 10 పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 62 ఏళ్లు పూర్తికాని రిటైర్డ్ ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరేందుకు అవకాశం కల్పించారు.



**పోర్టులు, పర్యాటకం, ఇతర నిర్ణయాలు**

పోర్టుల అభివృద్ధి: కేంద్ర ప్రభుత్వ నూతన చట్టాలకు అనుగుణంగా మచిలీపట్నం పోర్టు పరిధిని 64 కి.మీ. నుంచి 15 కి.మీ.కు, రామయ్యపట్నం పోర్టు పరిధిని 51 కి.మీ. నుంచి 15 కి.మీ.కు కుదిస్తూ నోటిఫికేషన్ల జారీకి ఆమోదం. రామయ్యపట్నం పోర్టును డీబీఎఫ్ఓటీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ఆపరేటర్ నియామకానికి ఆర్ఎఫ్‌పీ జారీకి అనుమతి.

**పర్యాటకం:** గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'హోమ్ స్టే', 'బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' ఏర్పాటును సులభతరం చేస్తూ పర్యాటక పాలసీకి సవరణలు. తిరుపతి మినహా రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో బార్లు, రిటైల్ మద్యం దుకాణాల ఏర్పాటుకు నూతన విధానానికి ఆమోదం.

రవాణా శాఖ: ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న టూరిస్ట్ బస్సులను రాష్ట్రంలోకి ఆకర్షించేందుకు, ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ వాహనాల త్రైమాసిక పన్నును ప్రతి సీటుకు రూ.4,000 నుంచి రూ.2,500కు తగ్గింపు.

ఆరోగ్యశ్రీ: నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నివారించేందుకు "బిల్ డిస్కౌంటింగ్ సిస్టమ్"కు ఆమోదం. దీనివల్ల ఆసుపత్రులు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకుల నుంచి తక్షణమే నిధులు పొందవచ్చు.

పరిపాలన: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం సహా 28 జిల్లాల కలెక్టరేట్లలో పాలనను బలోపేతం చేసేందుకు అదనపు పోస్టుల క్రమబద్ధీకరణకు ఆమోదం.

పునరుత్పాదక ఇంధనం: కడప జిల్లాలో 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఏపీఎస్పీసీఎల్‌కు భూమి కేటాయింపు. యాగంటి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 1000 మెగావాట్ల నుంచి 1500 మెగావాట్లకు పెంచేందుకు ఆమోదం.

ఈ మేరకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్న అంశాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# బీజేపీ గూటికి వైసీపీ ఎంపీలు

**తిరుపతి :** మళ్లీ కూటమిలో చేరికలు మొదలయ్యే అవకాశం ఉంది. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు మళ్ళీ పార్లమెంటు ముంగిటకు రానుంది. ఏపీలో దాదాపు 80 అసెంబ్లీ సీట్లతో పాటు 13 పార్లమెంటు సీట్లు పెరగనున్నాయి. అదే జరిగితే అధికార కూటమికి అభ్యర్థులు అవసరం ఉంటారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకోకపోవడంతో ఆ పార్టీ నేతలు జంప్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ పరిణామాల క్రమంలోనే జనసేన చేరికల కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు బిజెపి సైతం ఆపరేషన్ ఆకర్ష్ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. వైసీపీ ఎంపీలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు సమాచారం.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోక్సభలో నలుగురు ఎంపీలు, రాజ్యసభలో నలుగురు ఎంపీలు ఉన్నారు. వారిపై బిజెపి గురి పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. వారు సైతం అవసరాల కోసం బిజెపి వైపు మొగ్గు చూపుతున్నట్లు టాక్ నడుస్తోంది. ముఖ్యంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పేరు వినిపిస్తోంది. మద్యం కుంభకోణం కేసులో మిథున్ రెడ్డి నిందితుడిగా ఉన్నారు. ఆయన తండ్రి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై కూడా అనేక కేసులు నమోదయ్యాయి. వైసీపీలో ఒక వెలుగు వెలిగారు ఈ ఇద్దరు తండ్రి కొడుకులు. కానీ ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అందుకే పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి బిజెపి వైపు చూస్తున్నట్లు మళ్లీ ప్రచారం మొదలైంది.మరోవైపు వివేకానంద రెడ్డి హత్య కేసులో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు అవినాష్ రెడ్డి. ఎంతకాలం జగన్మోహన్ రెడ్డి బిజెపితో ఉన్న స్నేహంతో అవినాష్ రెడ్డి బయటపడ్డారు. కానీ ఇప్పుడు వైసీపీ విషయంలో బిజెపి అభిప్రాయం మారింది. కోర్టు కూడా మళ్లీ విచారణ మొదలు పెట్టాలని సిబిఐ కు ఆదేశించే అవకాశం ఉంది. అదే జరిగితే అవినాష్ రెడ్డి అడ్డంగా బుక్ కావడం ఖాయం. అందుకే ఆయన సైతం బిజెపిని ఆశ్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి సైతం బిజెపికి టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. టీటీడీ లడ్డు కల్తీ కి సంబంధించి అభియోగాలు మోపుతూ విచారణ లోతుగా సాగింది. సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా బలమైన ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది.. అందుకే ఆయన సైతం బిజెపి వైపు వచ్చేందుకు మంతనాలు సాగిస్తున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం ఉంది.అయితే ఈ ముగ్గురు జగన్మోహన్ రెడ్డికి అత్యంత విధేయులు. వారు పార్టీ మారుతారు అంటే అంత సులువు కాదు. పైగా వీరి అవసరం బిజెపికి ప్రస్తుతం లేదు. మీరు బిజెపిలో కేవలం ఇబ్బందులను దృష్ట్యా వెళ్తారే తప్ప.. వీరికంటూ వైసీపీపై ఎటువంటి అసంతృప్తి లేదు. పైగా టిడిపి నుంచి అనేక రకాల అభ్యంతరాలు ఉంటాయి. మీరు ఎట్టి పరిస్థితుల్లో బిజెపిలో చేరే అవకాశం లేనట్టు చాలామంది కొట్టి పారేస్తున్నారు.

సైకిల్ ఎక్కనున్న మహీధర్ రెడ్డి

ఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి ఒకరు గుడ్ బై చెప్పనున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు దాదాపు సిద్ధపడ్డారు. గత కొంతకాలంగా జగన్మోహన్ రెడ్డి తీరుతో ఆగ్రహంగా ఉన్నారు. జగన్ వైఖరిలో మార్పు రాకపోవడంతో పార్టీని వీటడమే మేలన్న నిర్ణయానికి ఆయన వచ్చారు. కార్యకర్తలతో వరుసగా భేటీలు నిర్వహిస్తూ వచ్చిన ఆయన పార్టీకి రాజీనామా చేసేందుకు డిసైడ్ అయ్యారు. ఆయనే నెల్లూరు జిల్లాకు చెందిన మాజీమంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి. ఇప్పటికే నెల్లూరు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన నైరాస్యం అలముకుంది. ఇప్పుడు మహీధర్ రెడ్డి గుడ్ బై చెబితే మరింత సంక్షోభం ఖాయం ఆ పార్టీకి.మానుగుంట మహిధర్ రెడ్డికి కందుకూరు రాజకీయాల్లో మంచి నేపథ్యం ఉంది. బలమైన క్యాడర్ కూడా ఉంది. మానుగుంట ఆదినారాయణ రెడ్డి వారసుడిగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు కాంగ్రెస్ పార్టీ ద్వారా. 1989లో తొలిసారిగా కందుకూరు నుంచి పోటీ చేసి గెలిచారు. 1994లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి మరోసారి ఓటమి చవి చూశారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో సైతం విజయాన్ని దక్కించుకున్నారు. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా కూడా వ్యవహరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కీలకమైన మున్సిపల్ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2014 ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2019లో మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచారు.. 2024 ఎన్నికల్లో జగన్ ఆయనకు టికెట్ ఇవ్వలేదు. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు మహిధర్ రెడ్డి దూరంగా ఉన్నారు. దాదాపు రెండేళ్లుగా ఆయన పార్టీలో యాక్టివ్ గా లేరు. ఇటీవల వరుసగా పార్టీ శ్రేణులతో పాటు అనుచరులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. పసుపు కండువా కప్పుకోవాలని దాదాపు ఒక నిర్ణయానికి వచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉండి.. ఆ తరువాత నెల్లూరు జిల్లాలో విలీనమైన కందుకూరు నియోజకవర్గంలో మహీధర్ రెడ్డి టిడిపిలో చేరితే ఒక ఊపు రావడం ఖాయం అని విశ్లేషకులు భావిస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, క్లీన్ ఇమేజ్ ఉన్న మహిధర్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీని వీడితే కచ్చితంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రభావం చూపడం ఖాయం. మహీధర్ రెడ్డిని పార్టీని వీడకుండా జగన్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలితం ఇవ్వడం లేదని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## ఉత్తరాంధ్ర అభివృద్ధి పరుగులు

**విశాఖపట్టణం :** ఉత్తరాంధ్ర పై వెనుకబాటు ఒక అపవాదు ఉంది. విశాఖ జిల్లాను పక్కన పెడితే విజయనగరం తో పాటు శ్రీకాకుళం జిల్లా వెనుకబడి ఉన్నాయన్నది ఇప్పటివరకు ఉన్న ప్రచారం. అయితే దానికి చెక్ పడనుంది. ఉత్తరాంధ్ర అన్ని విధాల అభివృద్ధికి పునాది పడింది. వచ్చే నెలలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం జాతికి అంకితం చేయనున్నారు. మరోవైపు విశాఖ తో పాటు ఉత్తరాంధ్రకు భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ఇప్పటికే గూగుల్ డేటా సెంటర్ రాకతో.. ఐటీ అనుబంధ పరిశ్రమల చూపు విశాఖ వైపు ఉంది. కేవలం విశాఖ మాత్రమే కాదు విజయనగరం తో పాటు శ్రీకాకుళం జిల్లాలో కూడా ఈ పరిశ్రమల విస్తరణకు అవకాశం ఉంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అనేది ఉత్తరాంధ్రకు గేమ్ చేంజర్గా నిలవనుంది. అన్ని రంగాల అభివృద్ధికి ఇది దోహదం కానుంది. పైగా సువిశాల తీర ప్రాంతం ఉత్తరాంధ్ర సొంతం. పర్యాటకంగానూ చాలా కీలక ప్రాజెక్టులు నిర్మితం కానున్నాయి ఉత్తరాంధ్రలో. కేవలం ఉత్తరాంధ్ర మాత్రమే కాదు పక్కనే ఉన్న ఒడిస్సా, చత్తీస్గఢ్ ప్రజలు సైతం భోగాపురం ఎయిర్పోర్ట్ మీదుగా రాకపోకలు సాగించనున్నారు. కచ్చితంగా ఇది విశాఖ తో పాటు ఉత్తరాంధ్రకు కలిసి వచ్చే అంశం. ఇతర రంగాల్లో కూడా అభివృద్ధి సాధిస్తే ఆదాయం భారీ స్థాయిలో సమకూరే అవకాశాలు ఉన్నాయిమరోవైపు విశాఖ- రాయపూర్ గ్రీన్ హైవే ఈ ఏడాది అందుబాటులోకి రానుంది. ఒడిస్సా తో పాటు చత్తీస్గఢ్ వరకు 500 కిలోమీటర్ల మేర ఈ రహదారి దాదాపు నిర్మితమైంది.

## లక్షల్లో ఫీజులు

-మొదటిపేజీ తరువాయి

ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను అదుపు చేయడానికి సరైన చట్టాలు లేకపోవడం ఈ పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. విద్య అనేది ఒక ప్రాథమిక హక్కుగా కాకుండా కేవలం డబ్బు ఉన్నవారికే దక్కే విలాసవంతమైన వస్తువుగా మారిపోవడం నేటి సమాజంలో అత్యంత విచారకరం. విజయవాడకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి రమేశ్ నెలవారీ జీతం రూ.45,000. రెండేళ్ల క్రితం ఆయన తన ఇద్దరు పిల్లలలో ఒకరిని జదీూజు పాఠశాలలో చేర్పించడానికి మొత్తం రూ.50,000కు పైగా ఫీజు చెల్లించారు. ఈ ఏడాది తన రెండో బిడ్డను చేర్పించడానికి రూ.60,000కు పైగా చెల్లించాల్సి వచ్చింది. రమేశ్? ఒక్కరే కాదు మధ్యతరగతి తల్లిదండ్రులలో అత్యధికులు తమ పిల్లల విద్య కోసం నిధులు సమకూర్చుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులపై నియంత్రణ లేకపోవడంతో, యాజమాన్యాలు ఇష్టానుసారంగా రేట్లను పెంచుతూ కఠినంగా వసూళ్లు చేస్తున్నాయి. తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే తల్లిదండ్రుల ఆశలను వారు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు.

విజయవాడలో ప్రైవేట్ పాఠశాలల్లో ూఖ+ ఫీజులు రూ.40,000 నుంచి రూ.70,000 వరకు ఉన్నాయి. ఎనిమిదవ తరగతి పైబడిన తరగతులకు, కొన్ని కార్పొరేట్ పాఠశాలలు రూ.1.5 లక్షలకు పైగా వసూలు చేస్తున్నాయి.

తిరుపతిలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు నర్సరీ కోసం ఏటా రూ.45,000 నుంచి రూ.75,000 వరకు వసూలు చేస్తున్నాయి. ూఖ+ -ఖఖ+ ఫీజులు రూ.65,000 నుంచి రూ.1 లక్ష వరకు ఉన్నాయి.

1 నుంచి 5వ తరగతి వరకు ఫీజులు రూ.75,000 నుంచి రూ.1.25 లక్షల వరకు ఉన్నాయి. విద్యార్థులు పై తరగతులకు వెళ్లేకొద్దీ ఫీజులు పెరుగుతూనే ఉంటాయి. విశాఖపట్నంలోని కొన్ని విద్యాసంస్థలు ఈ ఏడాది తమ ఫీజులను రూ.15,000 నుంచి రూ. 20,000 వరకు పెంచాయి. ఇక్కడి ఒక కార్పొరేట్ పాఠశాలలో ూఖ+ ఫీజు రూ.47,000 కాగా, పాఠ్యపుస్తకాల కోసం అదనంగా రూ. 11,000 వసూలు చేస్తున్నారు. అదే నగరంలో ఒక ప్రముఖ పాఠశాల నాలుగో తరగతికి ఏడాదికి రూ.1.20 లక్షల వరకు వసూలు చేస్తోంది. "అంతర్జాతీయ" పాఠశాలలుగా గుర్తింపు పొందిన వాటిలో ఫీజులు ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు కూడా భరించలేని విధంగా ఉన్నాయి. అక్కడ ప్రారంభ ఫీజు మాత్రమే రూ.90,000గా ఉంది.

వారు వివరించరు -ఎవరూ అడగరు : ఫీజులను ఇంత భారీగా ఎందుకు పెంచారో ఏ విద్యాసంస్థ కూడా వివరించడం లేదు. అలాగే ఈ పెంపునకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాన్ని కూడా అందించడం లేదు. అర్హతగల ఉపాధ్యాయులు లేని లేదా తమ వద్దకు వచ్చే విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా ఆట స్థలాల వంటి మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యే పాఠశాలల్లో కూడా ఏటా ఫీజులు పెరుగుతూనే ఉన్నాయి. కొన్ని కార్పొరేట్ ప్రముఖ పాఠశాలలు ఏటా 10% నుంచి 15% వరకు ఫీజులను పెంచుతున్నాయి. ఫీజులను నియంత్రించడానికి పాఠశాల విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మండల విద్యాధికారి (వీజూ), డిప్యూటీ డీఈఓ, లేదా డీఈఓలకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. ఫీజుల పెంపుపై తల్లిదండ్రులు ఫిర్యాదులు చేయడానికి ప్రత్యేక యంత్రాంగం ఏదీ లేదు. ఫలితంగా పాఠశాల యాజమాన్యాలు ఎంత మొత్తం డిమాండ్ చేస్తే అంత మొత్తం చెల్లించక తప్పడం లేదు. డిమాండ్ ఎక్కువగా ఉన్నచోట విరాళాలు : ఎక్కువ డిమాండ్ ఉన్న కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విరాళాలు సేకరిస్తున్నాయి. విజయవాడలోని ఒక పాఠశాల రూ.60,000 విరాళం సేకరిస్తుండగా విశాఖపట్నంలోని ప్రముఖ పాఠశాలలు కూడా విరాళాల రూపంలో రూ.50,000 పైగా వసూలు చేస్తున్నాయి. ట్యూషన్ ఫీజులకు అదనంగా తల్లిదండ్రులు ప్రతి సంవత్సరం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను విద్యాసంస్థ నుంచే కొనుగోలు చేయాలి, వాటిని ఎటువంటి ప్రశ్న లేకుండా నిర్దేశించిన ధరలకే కొనాలి. పిల్లల విద్యకే అధిక వ్యయం అవుతుంది : దిగువ-మధ్యతరగతి పేద కుటుంబాలకు, వారి ఆదాయంలో అత్యధిక వాటా పిల్లల విద్యపైనే ఖర్చవుతుంది. విద్యార్థులు పై తరగతులకు వెళ్లే కొద్దీ కొన్ని పాఠశాలలు ఫీజులను విపరీతంగా పెంచుతాయి. తమ పిల్లలను అక్కడ చేర్పించిన మధ్యతరగతి తల్లిదండ్రులు తరచుగా వారిని మాన్పించలేని పరిస్థితిలో ఉంటారు, దీంతో ఫీజులు చెల్లించడానికి అప్పు చేయవలసి వస్తుంది.

## డేటా సెంటర్లకు నిరంతర విద్యుత్

-మొదటిపేజీ తరువాయి

డేటా సెంటర్లకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విశాఖ ప్రాంతంలో ఏర్పాటయ్యే డేటా సెంటర్లకు దాదాపు 9.1 గిగావాట్ల విద్యుత్ అవసరమవుతుందని ఇంధనశాఖ అంచనా వేస్తోంది. 2036-37 నాటికి మొత్తం డిమాండ్ 15 గిగావాట్లకు చేరుతుందని భావిస్తోంది. ఈ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఒడిశా నుంచి వచ్చే జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో ఉత్తరాంధ్ర ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను అనుసంధానించే ప్రణాళికను ట్రాన్స్‌కో రూపొందించింది. కొత్త విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం ద్వారా జాతీయ గ్రిడ్ నుంచి విద్యుత్‌ను సులభంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రత్యేక సబ్‌స్టేషన్లు నిర్మించనున్న సంస్థలు: అదే సమయంలో రాయలసీమలోని పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల నుంచి ఉత్పత్తయ్యే గ్రీన్ ఎనర్జీని ఉత్తరాంధ్రకు తరలించేందుకు ప్రతిపాదించిన రూ.21,800 కోట్ల గ్రీన్ ఎనర్జీ కారిడార్‌తో కూడా ఈ నెట్‌వర్క్‌ను అనుసంధానించనున్నారు. దీంతో భవిష్యత్తులో డేటా సెంటర్లకు పెద్దఎత్తున పచ్చ విద్యుత్ అందే అవకాశం ఉంది. పెందుర్తి, అచ్యుతాపురం, పలాస, పద్మనాభం, మాకవరపాలెం ప్రాంతాల్లో 765 కెవీ, 400 కెవీ, 220 కెవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. తర్లువాడ, ముడసర్లోవ, పోలిపల్లి, చిన్నిపాలెం ప్రాంతాల్లో డేటా సెంటర్లు ఏర్పాటు చేసే సంస్థలే ప్రత్యేక సబ్‌స్టేషన్లను నిర్మించనున్నాయి.

**ఇంధనశాఖ అంచనాలు ఇవీ:**

విశాఖ ప్రాంతంలో ఏర్పాటయ్యే డేటా సెంటర్లకు 9.1 గిగావాట్ల విద్యుత్ అవసరం.

2036-37 నాటికి మొత్తం విద్యుత్ డిమాండ్ సుమారు 15 గిగావాట్లకు చేరుతుందని అంచనా. ఈ అవసరాలను తీర్చేందుకు వీలుగా నెట్?వర్క్ అభివృద్ధిపై ఏపీ ట్రాన్స్?కో దృష్టి పెట్టింది.

విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ట్రాన్స్?మిషన్ లైన్లు, కొత్త సబ్?స్టేషన్ల అభివృద్ధికి ప్రతిపాదనలను రూపొందించింది. పెందుర్తి, మరడాం, అచ్యుతాపురం, పలాస, పద్మనాభం, మాకవారిపాలెంలో నెట్?వర్క్ అనుసంధానానికి 765 కె.వి., 220 కె.వి. సబ్?స్టేషన్ల ఏర్పాటుకు నిర్ణయించింది.

తర్లువాడ, ముడసర్లోవ, పోలిపల్లి, చిన్నిపాలెం వద్ద డేటా సెంటర్లు ఏర్పాటు చేసే సంస్థలు కొత్త సబ్? స్టేషన్లను ఏర్పాటు చేస్తాయి.

డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా ఎదిగే అవకాశాలు: రాంబిల్లి డేటా సెంటర్ క్లస్టర్ అభివృద్ధిపై ట్రాన్స్‌కో ప్రత్యేక దృష్టి సారించింది. కాకినాడ ఎస్ఈజెడ్ నుంచి అచ్యుతాపురం, పెందుర్తి, రాంబిల్లి ప్రాంతాలకు ప్రత్యేక ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనుంది. మరోవైపు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ పెందుర్తిలో 765 కెవీ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టింది. గూగుల్, రిలయన్స్, టీసీఎస్ హైపర్ వాల్ట్, కంట్రోల్ ఎస్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖ ప్రాంతంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు రావడంతో, భవిష్యత్తులో ఈ ప్రాంతం దేశంలోనే కీలక డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా ఎదిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## వడ్డెరలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం

-మొదటిపేజీ తరువాయి



"యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశాను. ఆ సమయంలో వడ్డెర సోదరులు తమ కులవృత్తిని కొనసాగించడానికి క్వారీలు కేటాయించాలని నన్ను కోరారు. ఆనాడు ఇచ్చిన హామీ మేరకు ఈ జీవో జారీ చేశాం" అని తెలిపారు. తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని చెప్పారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నామని అన్నారు. మరోవైపు, కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వడ్డెర సంఘాల నేతలు, కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ కులవృత్తికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చినందుకు వారు మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# ఈ నెల 30న జరిగే మహాధర్నాను విజయవంతం చేయండి

## సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య



**వేలేరుపాడు : 23 జూన్ వేలేరుపాడు :ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్)**ప్రజా సమస్యల కోసం ఈ నెల 30న విజయవాడలో చేపట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వేలేరుపాడులోని స్థానిక సిపిఐ కార్యాలయంలో మంగళవారం జిల్లా కార్యవర్గ సభ్యులు పిట్ట ప్రసాద్ అధ్యక్షతన మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక, పకృతి విపత్తుల వలన నష్టపోయిన పంటలకు సహాయం అందక రైతులు, అలాగే ఈ ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టు వలన వేల నిర్వాసిత కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. పొగాకు. పామాయిల్ మొక్కజొన్న, వేరుశనగ, వరి, పత్తి తదితర పంటల పండించే రైతులకు గిట్టుబాటు ధర లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తి వైఫల్యం చెందాయని విమర్శించారు. గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలు అధికంగా పెంచడం వల్ల అన్ని రకాల నిత్యవసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అనేకసార్లు దరఖాస్తులు చేసిన పోడు భూములకు పట్టాలు ఇవ్వలేదన్నారు. దీంతో గిరిజనలు హక్కు పత్రాలు లేక ఎంతో నష్టపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై స్థానిక సమస్యల పరిష్కారానికై ఆగస్టు 6 నుండి 16 వరకు ప్రసార ఆందోళన కార్యక్రమం సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశానికి ముందుగా మండలంలోని పార్టీ కార్యకలాపాల రిపోర్టును మండల కార్యదర్శి బాడిస రాము తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య జై వి రమణ రాజు, నిమ్మగడ్డ నరసింహ, సిపిఐ సీనియర్ నాయకులు సన్నేపల్లి సాయిబాబు, నాయకులు పిట్టా వీరయ్య బంధం రమాదేవి మడివి కామయ్య కరటం సీతామాలక్ష్మి సోడే ప్రసాద్ బంధం నాగేశ్వరావు తాటి దుర్గారావు సోడే సత్తిబాబు జాన్ బాబు కొరిమెళ్ళ వెంకటేశ్వరరావు కాకా ముత్యాలరావు కట్టి రాంబాబు గోపి వర్మ హనుమంతరావు కంగాల గంగరాజు కారం కుమారి సోడే చిన్నమ్మి పెడకం వెంకటేశ్వరావు కరక ముత్యాలు కరటం పాపారావు బంధం చుక్కమ్మ బంధం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ పోస్టల్ శాఖ ఉద్యోగుల నిరసన.ధర్నా



**చింతూరు జూన్ 23ఃప్రజాజ్యోతి** అఖిలభారత గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ( ఎ ఐ జి డి ఎస్ యు ) ( పోస్టల్ డిపార్ట్మెంట్ )పిలుపుమేరకు మంగళవారం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన ధర్నాలు ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాజమండ్రి డివిజనల్ సెక్రటరీ పైడిశెట్టి భూలోకం పిలుపునిచ్చారు. ఈ పిలుపుమేరకు మంగళవారం చింతూరు సబ్ డివిజన్ లోని గ్రామీణ పోస్టల్ శాఖ ఉద్యోగులు చింతూరులోని సబ్ పోస్ట్ ఆఫీస్ ముందు పోస్టల్ ఉద్యోగి అల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తమ డిమాండ్ల సాధన కోసం నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్స్ అయినగ్రామీణ పోస్టల్ శాఖ ఉద్యోగులకు 8వ కేంద్ర వేతన కమిషన్ పరిధిలో చేర్చడం, లేదా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, అలాగే సాధారణ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, 1972 ప్రకారం గ్రాడ్యుటి మంజూరు చేయాలని,, జాతీయ ఉద్యోగులకు లభించే ప్రయోజనాలకు సమానమైన ప్రయోజనాలతో గ్రామీణ పోస్టల్ ఉద్యోగస్తులను రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్ట్ 2004 ముందు చేసిన సూత్రాల ప్రకారం పాత పెన్షన్ ప్రయోజనాలను లెక్కించాలని, అలాగే 8 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టాలని,, అంతకంటే ఎక్కువ పని చేస్తున్న వాస్తవ పరిస్థితిని గుర్తించాలని, అదనంగా నిర్వహించే పనికి అదనంగా పారితోషికం పెంచాలని కోరారు. కేంద్ర మాజీ జనరల్ సెక్రెటరీ ఎస్ఎస్ మహాదేవయ్య ను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. అలాగే పోస్టల్ శాఖ ఉద్యోగులపై, నాయకులపై జరుగుతున్న కక్ష సాధింపు, ప్రతీకార చర్యలను ఉపసంహరించుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అల్లి శ్రీనివాసరావు తో పాటు, పులి వెంకటనారాయణ, బాదం దుర్గాప్రసాద్, మణికంఠ( రామవరం) క్రాంతి వర్ధన్, శ్రీనివాస్, మణికంఠ( రామవరం)రాజు ( లక్కవరం) తదితరులు పాల్గొన్నారు

# ఎస్ కె పి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళల వసతిగృహం ప్రారంభించిన:ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం





**కూటమి ప్రభుత్వం విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పిస్తుంది: గుమ్మనూరు నారాయణ స్వామి**

**గుంతకల్లు జూన్ 23 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని శ్రీ కన్యాక పరమేశ్వరి డిగ్రీ ప్రభుత్వం కళాశాలలో నూతనంగా నిర్మించిన మహిళల వసతి గృహని గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వారి సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి మంగళవారం ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే కి కళాశాల ప్రిన్సిపల్ కళాశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహిళ వసతి గృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల ను దృష్టిలో పెట్టుకొని పి యం ఉషా నిధుల కింద 6 కోట్ల నిధులతో గుంతకల్లు పట్టణంలోని ఎస్ కె పి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా వసతి గృహాన్ని నిర్మించడం, నాలుగు కోట్లు నిధులతో ఫర్నిచర్లు మొత్తం 10 కోట్లతో వసతి గృహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ మహిళా వసతి గృహాన్ని చూస్తే కార్పొరేట్ వసతి గృహానికి మించిపోయే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందని, రాష్ట్రంలో నాలుగు చోట్ల ఏర్పాటు చేశారని, అందులో మొదటిగా గుంతకల్లు ఎస్కెపి కాలేజీ నందు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

**కూటమి ప్రభుత్వం విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పిస్తుంది: గుమ్మనూరు నారాయణ స్వామి**

విజనరీ లీడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంలో విద్యార్థిని, విద్యార్థులను, నిరుద్యోగు లను దృష్టిలో ఉంచుకొని గూగుల్, ఏఐ, అనేక పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను తీర్చేందుకు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పిస్తుందని, కావున విద్యార్థులు బాగా చదువుకొని మంచి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని గుమ్మనూరు నారాయణ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ బిఎస్ కృష్ణారెడ్డి, జనసేన సమన్వ యకర్త వాసగిరి మణికంత, డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షురా లు పత్తి హిమబిందు, టిడిపి మాజీ కౌన్సిలర్ అంజి, వై సుధాకర్, తలారి మస్తానప్ప, సూర్య పోగుల.మల్లేష్, ఎల్లప్ప, టిడిపి నాలుగో వార్డ్ ఇన్చార్జి ఎన్. రవికుమార్, వై. ఆనంద్, అరుణ్ కుమార్, నందీశ్వర్, బిజెపి నాయకులు కొలిమి రామాంజనేయులు, వన గొంది విజయలక్ష్మి, నాగసముద్రం శ్రీదేవి,ఉమ్మడి కూటమి సభ్యులు, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాతృ సంస్థ అభివృద్ధికి పూర్వ విద్యార్థి చేయూత

**ఎస్కేపీ కళాశాలలో డి. చట్టనాథన్ ప్రేరణాత్మక సందేశం**



**గుంతకల్లు జూన్ 23 (ప్రజా జ్యోతి):** స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంతకల్లును మంగళవారం కళాశాల 1979 బ్యాచ్ పూర్వ విద్యార్థి, ప్రముఖ దాత డి. చట్టనాథన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తన పేరుతో కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సుందరమైన "డి. చట్టనాథన్ పార్క్"ను ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డా. ఎ. లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో చట్టనాథన్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇస్తూ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కృషి చేస్తే జీవితంలో విజయాలు సాధించవచ్చని ప్రేరణాత్మ క సందేశం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా. ఎ. లక్ష్మయ్య మాట్లాడుతూ పూర్వ విద్యార్థిగా చట్టనాథన్ కళాశాల అభివృద్ధికి అందిస్తు న్న సేవలను కొనియాడుతూ, ఆయన సేవా దృక్పథం ఇతర పూర్వ విద్యార్థులకు స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచిత నోట్బుక్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. రవిశంకర్ శర్మ, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎం. జాకీర్ హుస్సేన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీమతి జమ్లాబీబి, చరిత్ర విభాగ అధ్యాపకులు డా. కె. గోపి నాయక్, మీడియా కోఆర్డినేటర్ కె. రాజశేఖర్, అలాగే బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల భీమాపాలసీల నిధులు దుర్వినియోగం పై విచారణ జరపాలి:-



**కూనవరం జూన్ 23 ప్రజా జ్యోతి** కూనవరం మండలం లో యం.ఇ. ఒ. 1 గా పనిచేస్తున్న వి. వి. లక్ష్మి నారాయణ ఉపాధ్యాయుల వ్యక్తి గత భీమా పాలసీలు నిధులు దుర్వినియోగం పై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలనీ పోలవరం జిల్లా విద్యాశాఖ అధికారి కి యుటిఎఫ్.జిల్లా కమిటీ మరియు ఏటిఏ కూనవరం మండల శాఖ ఆధ్వర్యంలో ఫిర్యాదు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పోలవరం జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ అవకతవకలు జరిగినట్టు విచారణ లో రుజువులు అయితే యం. ఇ. ఒ. లక్ష్మి నారాయణ పై చర్యలు తీసుకుంటామనీ చెప్పారు. ఈ కార్యక్రమం లో యుటిఎఫ్. కూనవరం మండల ప్రధాన కార్యదర్శి పి. కన్నారావు, యు. టి. ఎఫ్. జిల్లా కమిటీ సభ్యులు సనాతన్ బాబు, సూరిబాబు, ఏటిఏ కూనవరం మండల అధ్యక్షులు జితేంద్ర, యటపాక మండల ఏటిఏ. అధ్యక్షులు కాక. రాజు పాల్గొన్నారు.

## నర్సింగపేట గిరిజన ప్రాధమిక పాఠశాలకు తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలి

సిపిఎం నాయకులు

పల్లపు వెంకట్.సీసం సురేష్



**చింతూరు జూన్ 23 ప్రజాజ్యోతి** చింతూరు మండలం లోని ముకునూరు పంచాయతీ నర్సింగపేట ప్రభుత్వ గిరిజనప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులను తక్షణమే నియమించాలని సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ డిమాండ్ చేశారు.మంగళవారం ముకునూరు పంచాయతీ నర్సింగపేట గిరిజన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ను చింతూరు సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్,జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ సందర్శించారు. పాఠశాలలో 18 మంది విద్యార్థులు హాజరుకాగా ఉపాధ్యాయుడు లేక మధ్యాహ్న భోజన కార్మికురాలు శానిటేషన్ వర్కర్స్ పర్యవేక్షణలో పాఠశాల నడుస్తూ కనిపించింది. ఈ విషయంపై విద్యార్థులను ఆరా తీయగా పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయులు పదోన్నతి పై వేరే పాఠశాలకు వెళ్లారని అప్పటినుండి రెగ్యులర్ ఉపాధ్యాయులు లేరని పక్క పాఠశాల నుంచి ఎప్పుడో ఒకసారి పై వచ్చి విద్యార్థులకు బోధన ఇతర కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో సిపిఎం నాయకులు పల్లపు వెంకట్ సీసం సురేష్ మాట్లాడుతూ నరసింగ పేట ప్రభుత్వ గిరిజన పాఠశాలలో 18 మంది విద్యార్థులు ఉంటే విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు లేకపోవడం బాధాకరమని ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పునాది విద్యను అందించే ఉపాధ్యాయులు లేకపోతే ఉన్నత చదువులు, వ్యక్తిగత వికాసం పై విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి నర్సింగపేట పాఠశాలకు ఉపాధ్యాయుని నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ నియమించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో చింతూరు ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఎల్ నినో పొంచి ఉంది.. ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాలి

- జిల్లా కలెక్టర్



ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం పొంచి ఉన్నందున రైతులు వరికి బదులుగా ఆరుతడి, ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ సూచించారు. మంగళవారం చెన్నూరు మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలోని సుప్రియ ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా జరుగుతున్న యూరియా, డీఏపీ పంపిణీ విధానాన్ని పరిశీలించి, ఈ కొత్త విధానంపై రైతులతో ఆరా తీశారు. పంటలకు యూరియాను ఒకేసారి కాకుండా, ఎక్కువ దఫాలుగా వేయడం వల్ల పంటకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు వివరించారు. ఉద్యాన పంటలు సాగు చేయడం ద్వారా అన్నదాతలు అధిక లాభాలు గడించవచ్చని సూచించారు.

**రామనపల్లిలో 'రైతన్న మీకోసం'**

అనంతరం రామనపల్లిలోని రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ శ్రీధర్ సందర్శించారు. 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో పాల్గొని, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతున్న తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకోవడానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డిపీఎం) ప్రవీణ్ కుమార్.. ఘన జీవామృతం తయారీ, సీడ్ పెల్లెటైజేషన్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. పీఎం-డీఎస్ విధానంలో భాగంగా రైతులు 30 రకాల విత్తనాలను నాటుకోవాలని ఆయన సూచించారు.

**క్యూలైన్ల తిప్పలు తప్పాయి: జేడీఏ**

జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు (జేడీఏ) ఎం. సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ.. ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీతో రైతులు క్యూలైన్లలో నిలబడే కష్టాలు తప్పాయన్నారు. అవసరమైనప్పుడు ఎరువులు తీసుకునే వెసులుబాటును, అలాగే కౌలు రైతులకు కూడా యాప్ ద్వారా యూరియా, డీఏపీ తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) జి. లక్ష్మి మాధవి, మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్ఓ) విజయకుమారి, మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) కే. శ్రీదేవి, టెక్నికల్ అగ్రికల్చర్ ఆఫీసర్లు బి. కృష్ణసమత్ రెడ్డి, గోవర్ధన్, గ్రామ వ్యవసాయ సహాయకులు వసంత, గంగాభవాని, ఈశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పేదలను ఆదుకునే సీఎం నారా చంద్రబాబు నాయుడు : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు జూన్ 23 (ప్రజా జ్యోతి):** ఆపదలో ఉన్న పేదలను ఆదుకునే చల్లని చంద్రుడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యం నందు సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు వారి సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి హాజరై 72 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న వారికి పేదవారి కుటుంబానికి పెద్ద కొడుకుల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదుకుంటూ అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. అలాగే మంగళ వారం గుంతకల్లు నియోజక వర్గం దాదాపు 72 మందికి గాను 64,68,640 రూపాయ ల అందించడం జరిగినది. అలాగే మన గుంతకల్లు నియోజకవర్గం లో మొత్తం దాదాపుగా 920 మంది గాను 6 కోట్ల రూపాయలు నిరుపేద కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆర్థిక సహాయం చేయడం జరిగినది. సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కుల లబ్ధిదారులు మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గం లో జరగబోయే స్థానిక సంస్థ ఎలక్షన్లలో మన కూటమి ప్రభుత్వం తరపున ఎవరు పోటీ చేసిన గెలిపించుకొని తీరుతామని అలాగే మన గుంతకల్లు నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కి బహుమతిగా ఇస్తామని ఈ సభముఖంగా తెలియ జేస్తున్నాము కూటమి ప్రభుత్వానికి మరియు గుమ్మనూరు కుటుంబానికి రుణపడి ఉంటా మని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గం కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగినది.

## బ్రహ్మంగారిమఠంలో పలుచోట్ల వ్యవసాయ మోటార్ల చోరీ




**బ్రహ్మంగారిమఠం - ప్రజా జ్యోతిజూన్ 23** మండల కేంద్రంలోని సోమిరెడ్డి పల్లె పంచాయతీ రాచెరువు పొలాల్లో ఉన్నటువంటి రైతులు వజ్రాల బ్రహ్మయ్య, ఊటుకూరు సిద్ధారెడ్డి అనే రైతుల పొలాల్లో మోటార్లను ఆదివారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనంగా అపహరించారు. వర్షాలు సరిగా పడక రైతులు పంటలు సరిగా పండక అప్పుల ఊబిలో కూరుకు పోతున్న తరుణంలో కూడా ఇలాంటి దొంగతనాలు జరగడంపై రైతులు లబోదిబోమంటున్నారు రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులుసంఘటన స్థలాన్ని పరిశీలించారు. రైతులు తమ మోటర్లు దొంగతనం పై విచారణ జరిపి తమ మోటర్లను రికవరిచేసి తమకున్యాయం చేయాలని బాధిత రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

## మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులతో ఉద్యోగులను సత్కరించిన డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



**గుంతకల్లు జూన్ 23 (ప్రజా జ్యోతి):** రైల్వే భద్రత పట్ల అసాధారణ అప్రమత్తత, మరియు విధి నిర్వహణలో అంకితభావాన్ని ప్రదర్శించిన ఎనిమిది మంది ఉద్యోగులను "మ్యాన్ ఆఫ్ ది మంత్" అవార్డులతో సోమవారం గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా సత్కరించారు. అవార్డు గ్రహీతలు: సోను మీనా పాయింట్స్‌మన్, ఓబులపతి పాయింట్స్ మన్ దీపక్ కె. ఝా పాయింట్స్‌మన్, పవన్ కుమార్ స్టేషన్ మాస్టర్, సోమశేఖర్ నాయక్ టెక్నీషియన్, వై. తిరుపాల్ రెడ్డి టెక్నీషియన్, పి. కృష్ణమూర్తి కీమ్యాన్, ఎస్. బాషా కీమ్యాన్, వీరు భద్రతకు సంబంధించిన కీలక లోపాలు మరియు నిర్వహణ లో ఏర్పడిన అసాధారణ పరిస్థితులను సకాలంలో గుర్తించి, సంభావ్య ప్రమాదా లను నివారించడంలో కీలక పాత్ర పోషించారు. వారి అప్రమత్తత వల్ల రైళ్ల సురక్షిత నిర్వహణ నిరంతరంగా కొనసాగింది. అవార్డు గ్రహీతలందరికీ డిఆర్ఎం హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ మీ అప్రమత్త త, అంకితభావం మరియు భద్రత పట్ల ఉన్న నిబద్ధత ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

## మద్యం మత్తులో టిప్పర్ లారీ నడిపిన డ్రైవర్‌కు 7 రోజుల జైలు శిక్ష-ఎస్సై లక్ష్మీకాంతం

**కాకినాడ జిల్లా జూన్ 23(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)**మద్యం మత్తులో టిప్పర్ లారీని ప్రమాదకరంగా నడిపి ఇతర వాహనదారులను భయాందోళనలకు గురి చేసిన డ్రైవర్‌కు ప్రత్తిపాడు కోర్టు 7 రోజుల జైలు శిక్ష విధించింది.ఎస్సై లక్ష్మీకాంతం తెలిపిన వివరాల ప్రకారం.. పెదశంకర్లపూడి నుంచి సామర్లకోట వైపు మెటల్ లోడుతో వెళ్తున్న ఏపీ-39-డబ్ల్యూఆర్-2009 టిప్పర్ లారీ డ్రైవర్ కసిరెడ్డి మూలయ్య (38) మద్యం సేవించి వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుతున్నట్లు వాహనదారులు ఫిర్యాదు చేశారు.దీంతో ప్రత్తిపాడు పోలీసులు లారీతో పాటు డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించి మద్యం పరీక్ష నిర్వహించారు. పరీక్ష లో అతను మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో సీఐ బిఎస్ అప్పారావు ఆదేశాలతో మోటారు వాహనాల చట్టంలోని 185వ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మంగళవారం నిందితుడిని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా,కేసును విచారించిన న్యాయమూర్తి శారదామణి మద్యం మత్తులో వాహనం నడిపి ప్రజలకు ఇబ్బందులు కలిగించినందుకుబ మూలయ్యకు 7 రోజుల జైలు శిక్ష విధించారు.అనంతరం అతడిని ప్రత్తిపాడు సబ్‌జైలుకు తరలించారు.ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మీకాంతం మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని,అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కులాలను కలిపేది జనసేన.. కులాల కుంపటి రాజేసేది వైసీపీ

### రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్



**కాకినాడ జిల్లా పిఠాపురం (ప్రజా జ్యోతి)**పిఠాపురం నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం అధికంగా ఉండటంతోనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు విజయం సాధించారంటూ మాజీ ఎంపీ వంగా గీత చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్ విమర్శించారు. ప్రజా తీర్పును కులాల కోణంలో చూడడం వైసీపీ నాయకుల రాజకీయ దివాళా కోరుతనానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పిఠాపురం నియోజకవర్గంలో కేవలం కాపు సామాజిక వర్గం మాత్రమే కాకుండా శెట్టిబలిజ, యాదవ, పద్మశాలి, దళిత, మత్స్యకార మరియు ఇతర అన్ని వర్గాల ప్రజలు పవన్ కళ్యాణ్ అపూర్వమైన మద్దతు అందించారని తెలిపారు. ప్రజల సమస్యలపై స్పందించే నాయకత్వం, పారదర్శక రాజకీయాలు, ప్రజాసేవ పట్ల ఉన్న విశ్వాసంతోనే పిఠాపురం ప్రజలు పవన్ కళ్యాణ్ భారీ మెజారిటీతో గెలిపించారని చెప్పారు.పిఠాపురం అనేది సామాజిక సమైక్యతకు ప్రతీక అని, ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి జీవిస్తారని జగదీష్ పేర్కొన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలను పిఠాపురం ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని స్పష్టం చేశారు.అలాగే వంగా గీత గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, ఆమె కూడా కోనసీమ ప్రాంతానికి చెందిన నాయకురాలిగా రాజకీయంగా పిఠాపురానికి వచ్చి ప్రజల మద్దతు కోరారని అన్నారు. ప్రజలు నాయకుడిని ఆయన పుట్టిన ప్రాంతం ఆధారంగా కాకుండా, ప్రజల కోసం చేసే సేవలు, నిబద్ధత, నాయకత్వ లక్షణాల ఆధారంగా ఆదరిస్తారని చెప్పారు.పవన్ కళ్యాణ్ కుల రాజకీయాలతో ముడిపెట్టడం ద్వారా వైసీపీ నాయకులు తమ రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి అన్ని కులాలు, అన్ని వర్గాలు, అన్ని మతాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతుంటే, వైసీపీ మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. "పవన్ కళ్యాణ్ రాజకీయ సిద్ధాంతం మతాల ప్రస్తావన లేని రాజకీయం, కులాలను కలిపే ఆలోచనా విధానం. సమాజంలో విభజనలు సృష్టించడం కాదు, అన్ని వర్గాలు, అన్ని కులాలు, అన్ని మతాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఆయన లక్ష్యం. జనసేన పార్టీ సిద్ధాంతం సామాజిక సమైక్యత, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన మరియు అభివృద్ధి. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందడం జనసేన విధానం కాదు. ప్రజలందరినీ ఒక కుటుంబంగా భావించి ముందుకు సాగడమే పవన్ కళ్యాణ్ రాజకీయ తత్వం" అని జగదీష్ పేర్కొన్నారు. పిఠాపురం ప్రజలు గత ఎన్నికల్లో ఇచ్చిన తీర్పు కులాలకు అతీతమైన ప్రజా తీర్పని, దానిని కుల రాజకీయాలతో ముడిపెట్టడం ప్రజల నిర్ణయాన్ని అవమానించడమేనని అన్నారు. ఎన్నికల్లో ఘోర పరాజయం అనంతరం వైసీపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది పోయి పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత, రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. రాష్ట్రంలో సామాజిక సమైక్యతకు జనసేన పార్టీ కట్టుబడి ఉందని, కుల విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలను ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని పెంకే జగదీష్ పేర్కొన్నారు. ఇకనైనా వైసీపీ నాయకులు ప్రజా తీర్పును గౌరవించి బాధ్యతాయుతమైన రాజకీయాలు చేయాలని సూచించారు.

# జి రామ్ జీ నూతన చట్టం ద్వారా వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం

### జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి




**బేతంచెర్ల:జూన్ 23,(ప్రజా జ్యోతి)**కేంద్ర ప్రభుత్వం ఇటీవల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టం విబి జి రామ్ జి తెచ్చి పేదల నోట్లో మట్టి కొట్టాలనే ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టంగా కనపడుతున్నది. ఉపాది హామీ నిధుల్లో ఏపీకి భారీగా 40 వేల కోట్ల కోత పడుతున్నట్లు అర్థమవుతున్నదని రాష్ట్ర ప్రయోజనాలపై రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం మాట అయినా కూడా మాట్లాడని పరిస్థితి నెలకొన్నదని నూతన చట్టాన్ని రద్దుచేసి యధావిధిగా పాత చట్టాన్ని కొనసాగించాలని బి.కే.ఎం.యు జాతీయ సమితి పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బేతంచెర్ల మండల సమితి ఆధ్వర్యంలో తహసిల్దార్ నాగమణి గారికి డిమాండ్స్ కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బి.కె.ఎశ్.యు మండల కార్యదర్శి దస్తగిరి మండల నాయకులు సోమన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా బి.కె.ఎం.యు మండల కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ.**

కేంద్ర ప్రభుత్వం జూలై 1వ తేదీ నుండి రాష్ట్రంలో అమలు చేయాలని ప్రవేశపెట్టనున్న జి రాంజీ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యంగా మన కరువు ప్రాంతాలు, మెట్ట ప్రాంతాల్లోని లక్షలాది కుటుంబాలకు ఉపాధి హామీ ఒక కీలకమైన జీవనాధారమని 2014-2015 నుంచి 2025 -2026 వరకు ఉపాధి హామీ పథకం కింద ఆంధ్రప్రదేశ్ కు కేంద్రం నుంచి సుమారు 77,400 కోట్లు వచ్చాయని అదే కాలంలో దేశవ్యాప్తంగా ఉపాధి హామీపై జరిగిన వ్యయంలో దాదాపు 8.8%, కానీ కేంద్రం కొత్తగా తీసుకువస్తున్న విబి జి రామ్ విధానం ప్రకారం నిధుల కేటాయింపు జరిగితే, ఆంధ్రప్రదేశ్ వాటా 8.8% నుంచి కేవలం 4.22 శాతానికి పడిపోయే ప్రమాదం ఉంది. అంటే అదే స్థాయి జాతీయ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఏపీకి రావలసిన నిధులు సుమారు 77,400 కోట్ల నుంచి 37 వేల కోట్లకు తగ్గుతుందని ఆంధ్రప్రదేశ్ కి దాదాపు 40,000 కోట్ల నష్టం కలిగే అవకాశం ఉంది. అది చిన్న సాంకేతిక మార్పు కాదు. ఇది ఆంధ్రప్రదేశ్ లోని 28 జిల్లాల్లో 688 మండలాల్లో 13,326 గ్రామపంచాయతీల్లో ఉన్న 26 వేల గ్రామాల్లోని ప్రజలు 66.45 లక్షల మంది జాబ్ కార్డులు జారీ చేయగా అందులో యాక్టివ్ గా ఉన్న జాబ్ కార్డులు 55 లక్షలు మాత్రమే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో దళితులు, గిరిజనులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పేద కుటుంబాలు వలసలు పెరిగే ప్రమాదం వుంది. గ్రామీణ ప్రాంతాలపై నేరుగా పెద్ద ఆర్థిక ప్రభావం చాలా తీవ్రంగా పడే అవకాశం ఉందని ఆవేదనతో అన్నారు.ఉపాధి హామీ పథకం సాధారణ సంక్షేమ పథకం కాదు. అది పేదల చట్టబద్ధమైన హక్కు. ఆంధ్రప్రదేశ్ కు రావలసిన వాటా తగ్గిపోతే దాని ప్రభావం నేరుగా గ్రామీణ కూలీల మీద, ముఖ్యంగా అట్టడుగు వర్గాలు దళితులు, గిరిజనులు, ఆర్థికంగా వెనకబడిన వర్గాలపై పడుతుందని ఇంత పెద్ద నష్టం రాష్ట్రంలో ఉపాధి కూలీలకు ఎదురవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం చాలా బాధాకరమని ,రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై పనుబారం పడుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని బిజి రామ్ చట్టాన్ని వ్యతిరేకించి అసెంబ్లీలో తీర్మానం చేయవలసి ఉండగా, ఇటీవల మంత్రి మండలి సమావేశంలో కొత్త చట్టాన్ని ఆమోదించడం వ్యవసాయ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి తెలియజేస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పై రాబోయే సంవత్సర కాలంలో ఆర్థిక పెనుభారంగా మారి ఉపాధి హామీకి నిధులు కేటాయించే పరిస్థితి ఉండకపోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ముందుగా తన వాటా 40 శాతం డబ్బులు కేటాయిస్తేనే, కేంద్ర ప్రభుత్వం 60% విదులు కేటాయిస్తుందని దీనివలన మన రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఇప్పటికైనా కొత్త చట్టం వలన రాష్ట్రానికి జరిగే ఆర్థిక వేసులుబారంపై రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బి కే ఎం యు మండల సమితి డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తిరుమష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, బి.కె.ఎం.యు నాయకులు ప్రదీప్, మధు, గౌరీ ఉదయ్, శివ,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# దన్నవాడ గొల్లపల్లెలో మూడు రోజుల పాటు వైభవంగా విగ్రహా, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు





### మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక వేడుకలు
### 24న ధ్వజస్తంభ, విగ్రహా ప్రతిష్ఠ ప్రధాన ఘట్టం
### అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు
### భక్తులను ఆహ్వానించిన గ్రామ పెద్దలు, ప్రజలు

**మైలవరం ప్రజా జ్యోతి** మైలవరం మండలంలోని దన్నవాడ గ్రామంలో శ్రీ లక్ష్మీప్రసన్న చెన్నకేశవ స్వామి, శ్రీ రుద్రాక్ష సాలగ్రామ ఈశ్వర స్వామి వారి విగ్రహా ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు, అలాగే గొల్లపల్లె గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పెద్దమ్మతల్లి బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాలు జూన్ 22 నుంచి 24 వరకు మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించబడుతున్నాయి.శ్రీ పరాభవ నామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ పక్షంలో, శ్రీ దివ్య పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం త్రయాహ్నక దీక్షతో ఈ మహోత్సవాలు జరుగుతున్నాయి. శ్రీ శ్రీ శ్రీ సద్గురు రామమోహన స్వామి వారి పర్యవేక్షణలో వారి కరకమలముచే విగ్రహా ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. మొదటి రోజు వేదస్వస్తి, గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలు నిర్వహించగా, రెండో రోజు వాస్తు పూజ, జలాధివాసం, క్షీరాధివాసం, బింబశుద్ధి, శాంతి హోమాలు, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. బుధవారం (జూన్ 24) ఉదయం పీఠార్చన, రత్నన్యాసం, యంత్రస్థాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, జీవన్యాసం, పూర్ణాహుతి, కుంభాభిషేకం వంటి ప్రధాన కార్యక్రమాలు ఘనంగా జరగనున్నాయి.ఈ ఆలయ నిర్మాణం, ప్రతిష్ఠ కార్యక్రమాలకు శ్రీమతి అల్లె ప్రభానాగిరెడ్డి, శ్రీ అల్లె బాలనాగిరెడ్డి దంపతులు ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు. మూడు రోజుల పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు.ఈ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని దన్నవాడ, గొల్లపల్లె గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు ఆహ్వానించారు.

# వ్యసనాలకు దూరంగా ఉండండి.. ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోండి...

గ్రామాల్లో చైతన్య జ్యోతి.. నేరాల నివారణకు పోలీసుల అవగాహన సదస్సులు

సైబర్ మోసాల నుంచి రక్షణకు జాగ్రత్తలే కవచం

విద్యార్థులు, గ్రామస్థులకు అవగాహన కల్పించిన సీఐలు వి. కృష్ణ, ఎం. కన్నపరాజు

మహిళల భద్రత, బాల్యవివాహాల నిరోధంపై ప్రత్యేక దృష్టి





**ఎటపాక, జూన్ 23 (ప్రజాజ్యోతి):**యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఎటపాక సీఐ వి. కృష్ణ, పోలవరం మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం. కన్నపరాజు సూచించారు. మంగళవారం ఎటపాక మండలం బొజ్జుగుప్ప గ్రామంలో, అలాగే ఎటపాకలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులు, గ్రామస్థులకు సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల భద్రత, బాల్యవివాహాల నిరోధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ నేటి సమాజంలో సైబర్ నేరాలు విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీ వివరాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. ఒకవేళ సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 సహాయ కేంద్రానికి సమాచారం అందించాలని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత జీవితాలను నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయించడం, రవాణా చేయడం లేదా వినియోగించడం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. మహిళల భద్రతకు ప్రభుత్వం, పోలీస్ శాఖలు అనేక చర్యలు చేపడుతున్నాయని పేర్కొన్నారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు ఎదుర్కొన్నా భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అలాగే బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికలకు విద్యను అందించి ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా రక్షణ శిరస్త్రాణం ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు. అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, మహిళలు, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మ కోట పంచాయతీలో భూ వ్యాపారి ప్రభుత్వ భూమి కబ్జా.

అక్రమ భవన నిర్మాణం.

సమాచారం తెలిసిన పట్టించుకోని రెవెన్యూ శాఖ.



**అనంతగిరి మండలం. జూన్ 23. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** నాన్ షెడ్యూల్ ప్రాంతాలలో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములనుకబ్జా చేసి అక్రమ నిర్మాణాలు జరుపుతున్న అనంతగిరి మండల రెవెన్యూ శాఖ మౌనం వహిస్తుంది. అల్లూరి సీతా రామరాజు జిల్లా. అనంతగిరి మండలం. గుమ్మకోట పంచాయతీ. చిప్పపల్లి రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ భూమిని భూ బకాసురులు దర్జాగా కబ్జా చేసి అక్రమ భవన నిర్మాణంచేపట్టారు. ప్రభుత్వ భూమి కబ్జా చేసి నిర్మాణం జరిపి ఉన్న మండల రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. భూ బకాసురులుకబ్జా చేసిన భూమిగుమ్మకోట బాలురు పాఠశాలకు దగ్గరలో ఉంది. ప్రస్తుతం గుమ్మకోట పంచాయతీలో భూముల రి సర్వే జరుగుతుంది సర్వే బృందం ఎటువంటి సమాచారం ప్రభుత్వానికి సమర్పిస్తుందో వేచి చూడాలి. మండల రెవెన్యూ అధికారికి భూ కబ్జా. అక్రమ నిర్మాణం పై విలేకరుల సంఘం ప్రతినిధులు ఫిర్యాదు.

## పొందూరు మండలాన్ని సందర్శించిన పంచాయతీ రాజ్ ఈ.ఈ నాగేష్

– సీసీ రోడ్లు , వి.ఎల్.సి భవనాల నాణ్యత పై క్షేత్రస్థాయిలో పరిశీలన





**పొందూరు ప్రజాజ్యోతి న్యూస్ :** పొందూరు మండలంలో పలు గ్రామాలను ఇటీవల పంచాయతీ రాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్గా నూతన బాధ్యతలు చేపట్టిన వి నాగేష్ మంగళవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా పొందూరు ధర్మపురం గ్రామాలలో ఇటీవల నిర్మించిన నూతన సీసీ రోడ్డు నిర్మాణాలను రాపాక దల్లవలస గ్రామంలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు, బొడ్డేపల్లిలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణాలను ఆయన పరిశీలించి ,పనుల నాణ్యత,నిర్మాణ ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతీ నిర్మాణం ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా ఉండాలని ,పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఈ చంద్రశేఖర్ , ఏ.ఈ దయాకర్ , వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు

## కౌతాళంలో ఓటర్ల ప్రత్యేక(సర్) సమగ్ర సవరణ



**కౌతాళం, జూన్ 23 ప్రజా జ్యోతి** కౌతాళం టౌన్ నందు (సర్)ఇంటింటా కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం మరియు ఎన్నికల సంఘం నిర్వహించిన(సర్) ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ల ఇంటింటా సర్వే కార్యక్రమంలో ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి పిలుపు మేరకు మంగళవారం రోజున కౌతాళంలో బూత్ లెవెల్ అధికారులు మరియు తెలుగుదేశం కుటుంబ సభ్యులు(160,167) బూత్ కన్వీనర్ లతో కలిసి ప్రతి ఓటర్ సమస్యలను విని పరిష్కారం చూపుతూ, దీని ద్వారా అక్రమ, డూప్లికేట్ ఓట్లను తొలగించి,అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే దిశగా ఈరోజు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది, ఈ కార్యక్రమంలో టౌన్అధ్యక్షులు డాక్టర్ రాజనంద్, బూత్ కన్వీనర్ గొట్టయ్య,(బి యల్ వో) రాజ్ కుమార్ మైతిలి మేడం మరియు తదితరులు పాల్గొన్నారు,

## మద్యం మత్తులో టిప్పర్ లారీ నడిపిన డ్రైవర్‌కు 7 రోజుల జైలు శిక్ష-ఎస్సై లక్ష్మీకాంతం



**కాకినాడ జిల్లా జూన్ 23(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)**మద్యం మత్తులో టిప్పర్ లారీని ప్రమాదకరంగా నడిపి ఇతర వాహనదారులను భయాందోళనలకు గురి చేసిన డ్రైవర్‌కు ప్రత్తిపాడు కోర్టు 7 రోజుల జైలు శిక్ష విధించింది.ఎస్సై లక్ష్మీకాంతం తెలిపిన వివరాల ప్రకారం.. పెదశంకర్లపూడి నుంచి సామర్లకోట వైపు మెటల్ లోడుతో వెళ్తున్న ఏపీ-39-డబ్ల్యూఆర్-2009 టిప్పర్ లారీ డ్రైవర్ కసిరెడ్డి మూలయ్య (38) మద్యం సేవించి వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుతున్నట్లు వాహనదారులు ఫిర్యాదు చేశారు.దీంతో ప్రత్తిపాడు పోలీసులు లారీతో పాటు డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించి మద్యం పరీక్ష నిర్వహించారు.పరీక్షలో అతను మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో సీఐ బివిఎస్ అప్పారావు ఆదేశాలతో మోటారు వాహనాల చట్టంలోని 185వ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.మంగళవారం నిందితుడిని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా,కేసును విచారించిన న్యాయమూర్తి శారదామణి మద్యం మత్తులో వాహనం నడిపి ప్రజలకు ఇబ్బందులు కలిగించి నందుకుబ మూలయ్యకు 7 రోజుల జైలు శిక్ష విధించారు.అనంతరం అతడిని ప్రత్తిపాడు సబ్‌జైలుకు తరలించారు.ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మీకాంతం మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని,అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కంబదూరులో ఈనెల 25,26, రెండు రోజులపాటు మొహరం వేడుకలు..



**కంబదూరు జూన్ 23: (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల కేంద్రంలో ఈ నెల 25, 26 తేదీలలో (గురువారం) (శుక్రవారం) రెండు రోజుల పాటు మొహరం పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా భక్తిశ్రద్ధలతో మొహరం ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 25వ తేదీ గురువారం పానకాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు, 26వ తేదీ శుక్రవారం జల్ది కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారని చెప్పారు.మొహరం పండుగ సందర్భంగా శాంతి, సామరస్య వాతావరణంలో వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు కోరారు.

## ప్రజల పిలుపుతో స్పందించిన ఏటూరు రామచంద్రారెడ్డి



**చింతకొమ్మ ప్రజాజ్యోతి శ్రీరామ్ జూన్ 23** కడప కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ నాయనవారిపల్లిలో డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని స్థానిక ప్రజలు టీడీపీ సీనియర్ నాయకుడు, 16వ డివిజన్ ఇన్‌చార్జ్ అయిన ఏటూరు రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల ఫిర్యాదుపై వెంటనే స్పందించిన ఆయన కార్పొరేషన్ అధికారులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 16వ డివిజన్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే డివిజన్‌కు సంబంధించిన సమస్యలపై పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మరియు పుత్తా నరసింహారెడ్డితో చర్చించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని ఏటూరు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

## డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు






**కాట్రేని కోన ప్రజాజ్యోతి** డా బి ఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పానసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన 75 బూతులు గ్రంధి నాని బాబు వారి ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ భారతీయ జనతా పార్టీ జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ పాల్గొని వారి చిత్రపటానికి పుష్పాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శ్యాంప్రసాద్ ముఖర్జీ, (1901, జూలై 6) ప్రముఖ జాతీయవాద నేతలలో ముఖ్యుడు. 1951లో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించిన ముఖర్జీ ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించాడు. హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడైన శ్యాం ప్రసాద్ ముఖర్జీ, జనసంఘ్‌ను స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం పొందినాడు. కలకత్తా విశ్వవిద్యాలయం కులపతిగా పనిచేసిన అశుతోష్ ముఖర్జీ కుమారుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ కోల్‌కత లోనే ఉన్నత విద్యాభ్యాసం అభ్యసించి ప్రారంభంలో కాంగ్రెసు వాదిగానే రాజకీయ జీవితం ఆరంభించాడు. స్వాతంత్ర్యానికి పూర్వం జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వంలో పరిశ్రమల మంత్రిగా పనిచేశాడు. 1949లో ఢిల్లీ ఒప్పందానికి వ్యతిరేకంగా కాంగ్రెసు పార్టీ నుంచి తప్పుకొని అక్టోబరు 21, 1951 న జనసంఘ్ పార్టీని స్థాపించి, ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా మే 23, 1953 న మరణించేవరకు కొనసాగినాడు. డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను దేశ ప్రధాని నరేంద్ర మోడీ నెరవేరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధి మణికంఠ చెరుకు రాంబాబు గ్రంధి మహేష్ చిట్టూరి మణికంఠ కాదా ప్రసాదు రంబాల గంగాధరం సమసాని మణికంఠ తదితరులు పాల్గొన్నారు

## ఉర్దూ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం








**కంబదూరు జూన్ 23:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల కేంద్రం నందు ఉన్న ఎంపీపీ పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల లో అడ్మిషన్లు ప్రారంభమైనాయని మంగళవారం ఆపాఠశాల ప్రధానోపాధ్యాయులు, మోహన్, అబ్దుల్ సలాం,లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు వద్దు-ప్రభుత్వ పాఠశాలలు ముద్దు"అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ప్రచారాన్ని చేపట్టా బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మరియు పౌష్టిక ఆహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తుంది. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన, అనుభవ జ్ఞానులైన, ఉపాధ్యాయులు బోధిస్తున్నారని వారు పేర్కొన్నారు. తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా, ప్రభుత్వ బడుల్లో చేర్పించి మెరుగైన భవిష్యత్తును అందించాలని కోరారు. విద్యార్థుల తల్లి దండ్రులు బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు.

## తహసిల్దార్ కార్యాలయంలో (ఆర్ ఐ) గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు కు రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ గా పదోన్నతి..



**కంబదూరు జూన్ 23:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా విధులు నిర్వహిస్తున్న నాగరాజుకు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి లభించినట్లు తహసీల్దార్ బాలకిషన్ తెలిపారు. పదోన్నతి నేపథ్యంలో నాగరాజును సెట్టూరు మండలానికి రీ సర్వే రెగ్యులర్ డిప్యూటీ తహసీల్దార్‌గా కంబదూరు మండలానికి రీ సర్వే ఇన్చార్జ్ డిప్యూటీ తాసిల్దార్‌గా బదిలీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నాగరాజుకు అభినందనలు తెలియజేస్తూ, కొత్త బాధ్యతల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కంబదూరు మండలంలో విధులు నిర్వహించిన కాలంలో నాగరాజు ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలను సమర్థవంతంగా అందించారని సహచర ఉద్యోగులు పేర్కొన్నారు. పదోన్నతి పొందిన నాగరాజుకు మండలంలోని అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఫజుల్లాబాద్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనం- యువకుడు మృతి..**



**దేవీపట్నం జూన్ 23(ప్రజా జ్యోతి):**-పోలవరం జిల్లా దేవీపట్నం మండల పరిధిలోని ఫజుల్లాబాద్ గ్రామ సమీపంలోని చెరువు గట్టు వద్ద విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దేవీపట్నం నుండి పాతకోట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. పోలీసుల వివరాల ప్రకారం, గోకవరం నుండి ఇందుకూరుపేట వైపు వెళ్తున్న యువకుడు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తున్న బస్సును తప్పించేందుకు ప్రయత్నించే క్రమంలో అదుపుతప్పి నేరుగా బస్సును ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు కాగా, వాహనం నడుపుతున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆసుపత్రికి తీసుకెళ్తున్న మార్గమధ్యలోనే అతడు మృతి చెందినట్లు సమాచారం.ఘటనపై సమాచారం అందుకున్న దేవీపట్నం ఎస్సై షరీఫ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించారు.మృతుడు గంగవరం మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన యువకుడిగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనతో సూరంపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా,మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నిరుపేద కుటుంబానికి అండగా మురళీ కృష్ణంరాజు

**ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ నుండి రూ.5 వేలు ఆర్థిక సాయం**



**కాకినాడ జిల్లా జూన్ 23 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** శంఖవరం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కూనిశెట్టి చిన్న అప్పారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడలోని లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు ఆసుపత్రికి వెళ్లి అప్పారావును పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.అలాగే కుటుంబానికి ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి ఆసుపత్రి నిర్వహణ ప్రతినిధి రాంబాబు, వెంకటనగరం మాజీ సర్పంచ్ బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి నూకరాజు,కె రామకృష్ణ,జాన్ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లప్రోలులో గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై శిక్షణ



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)**గొల్లప్రోలు:మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ శిక్షణలో మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, మరియు వి.ఓ.ఎ లకు గ్రామ ప్లానింగ్, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్ బి.వి. భాస్కర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్. సెలట్ రాజు, మరియు జీఎస్డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీఓ చ్. వెంకటేశ్వరరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికలు అవసరమని, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి జీపీడీపీ లక్ష్యాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ పరిజ్ఞానాన్ని గ్రామ ప్రణాళికల తయారీలో సద్వినియోగం చేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మరియు ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

## రిసర్వేతో భూ వ్యాపారుల గుండెల్లో గుబులు.

**భూ అక్రమాలు వెలుగులోకి వస్తాయనే భయం.**

**అనంతగిరి మండలం. జూన్ 23. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** నాన్ షెడ్యూల్ ప్రాంతాల్లో భూ కబ్జాలు.దోపిడీలు బహిరంగంగా జరిగిన వాస్తవాలు స్థానిక ప్రజానీకానికి తెలిసిందే కానీ ఏమి చేయలేని పరిస్థితి అసలు కథ అంటే రీ సర్వే ప్రారంభమైంది కాబట్టి రైతులకు ఉన్న జిరాయితిభూమి ఎంత.ప్రభుత్వ భూమి ఎంత. ఎంత ప్రభుత్వభూమి కబ్జాకోరుల చేతిలో ఉంది అనేది మరికొద్ది రోజుల్లో తేలిపోతుంది. ప్రస్తుతం గుమ్మ కోట పంచాయతీ లో సర్వే బృందం రీ సర్వే ప్రారంభించారు.ప్రారంభ దశలోనే బిల్లా కోట రెవెన్యూ పరిధి లో సుమారు 100.ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక భూస్వామి కబ్జా చేసి నిర్మాణాలు జరిపి ఉన్నారని స్థానిక ప్రజానీకం నుండి వెలువడుతున్న ఆరోపణ. స్థానికుల ఆరోపణ రుజువు కావాలంటే పూర్తిస్థాయిసర్వే జరగవలసి ఉంది. సర్వే బృందంలో ఒకరిద్దరు అధికారులు భూ వ్యాపారులతో కుమ్మకవుతున్నట్లు సమాచారం. సర్వే బృందం పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.సర్వే విషయంలో ఇటువంటి తప్పిదాలు జరిగిన రైతులకు.ప్రభుత్వానికి తీవ్రమైన నష్టం జరిగే అవకాశం ఉంది.

# కత్తిపూడిలో ఎమ్మెల్యే సత్యప్రభ పర్యటన ఘన స్వాగతం పలికిన వెన్నా శివ

**--శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు**

**--గ్రామంలో 2 చోట్ల అంబేద్కర్ కమ్యూనిటీ హాళ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే**



**కాకినాడ జిల్లా జూన్ 23(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు నియోజకవర్గం,శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ భ్రమరాంబికా సమేత శ్రీ మల్లికార్జున స్వామివారిని,అలాగే శ్రీ గోపాలకృష్ణ స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే సత్యప్రభకు రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో అర్చకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కోళ్లపారం సెంటర్ వద్ద స్వర్గీయ వరుపుల రాజా జ్ఞాపకార్థం వెన్నా శివ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సొంత నిధులతో నూతనంగా నిర్మించిన డా.బిఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే సత్యప్రభ ప్రారంభించారు.అలాగే ప్లాజా వద్ద డా బి ఆర్ అంబేద్కర్,బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలను ఆవిష్కరించి నూతన కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్,తుని జోన్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం,కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి,పోలం చిన్నా,బద్ది రామారావు,ఈగల దేవుళ్లు,కేలంగి జన,పోసిన శ్రీను,మాజీ ఎంపీటీసీలు సాదనాల లక్ష్మిబాబు,కంచిబోయిన శ్రీను,రౌతు శివ,గాబు శివ,జ్యోతుల శివ,కొయ్యా రమణ, అలపు సత్తిబాబు,నందికోళ్ల హరీష్, మిర్యాల మానేశ్వరావు,దేశెట్టి శ్రీను,వల్లభశెట్టి మధు పెనుపోతుల అబ్బులు తదితర కూటమి నాయకులు,కార్యకర్తలు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జిల్లాలో అభివృద్ధి , ప్రజా సమస్యల పరిష్కారం పై సమీక్ష

**- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పై విస్తృత చర్చ**

**- టిడిపి జిల్లా పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం**

**- కార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ , రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు**





**ఎన్టీఆర్ జిల్లా , ప్రజా జ్యోతి న్యూస్ :**ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ నియోజకవర్గాల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమం అమలుపై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మెన్ ఎరుబోతు రమణారావు ,పలు కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గురించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను పారదర్శకంగా అమలు చేయడంతో పాటు అర్హులైన ప్రతీ ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.అనంతరం విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతీ ఒక్క నాయకుడు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మెన్ ఎరుబోతు రమణారావు మాట్లాడుతూ సామాజిక వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ లో భాగంగా ఓటు హక్కు పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని ప్రజాస్వామ్యానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు ఎంఎస్ బేగ్ ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నాగవంశం డైరెక్టర్ మొకర ఆదిబాబు,జిల్లా నియోజకవర్గ స్థాయి పార్టీనాయకులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని పలు అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

# రాయచోటికి ఎంజేపీ గురుకులం మంజూరు బీసీ విద్యార్థుల విద్యా ప్రగతికి మరో మైలురాయి

**ప్రభుత్వ నిర్ణయంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం**

**సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు**

**రాయచోటి, జూన్ 23 ప్రజా జ్యోతి** బీసీ విద్యార్థులకు నాణ్యమైన, పోటీ ప్రపంచానికి అనుగుణమైన విద్యను అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంలో భాగంగా 10 కొత్త మహాత్మా జ్యోతిబా ఫూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాలల ఏర్పాటుకు ఆమోదం తెలపడం హర్షణీయమని, అందులో అన్నమయ్య జిల్లా రాయచోటికి గురుకుల పాఠశాల మంజూరు కావడం జిల్లాకు గర్వకారణమని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరువ చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాయచోటిలో గురుకుల పాఠశాల ఏర్పాటు ద్వారా జిల్లాలోని బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, భవిష్యత్ పోటీ ప్రపంచంలో వారు మరింత ముందుకు వెళ్లేందుకు ఇది బలమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 5 బాలుర, 5 బాలికల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు, ప్రతి గురుకులానికి అవసరమైన 37 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించడం విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తున్నదానికి నిదర్శనమన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే గురుకులాల ప్రారంభం కావడం విద్యార్థులకు మరింత ప్రయోజనకరమని తెలిపారు.రాయచోటికి ఎంజేపీ గురుకులం మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత గారికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.బీసీ విద్యార్థుల విద్యాభివృద్ధి, సామాజిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భవిష్యత్తులో మరింత ఫలితాలు ఇస్తాయని మంత్రి ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.



## విద్యార్థుల భవిష్యత్‌కు అండగా జనసేన నాయకుడు గోపిశెట్టి శ్రీను

--ప్రత్తిపాడు హై స్కూల్ కు రూ.30 వేలు విలువ చేసే ప్రింటర్ బహుకరణ

--ఈ విద్యా సంవత్సరంలో 585 మార్కులు వచ్చిన విద్యార్థులకు రూ.25 వేల నగదు ప్రకటన



**కాకినాడ జిల్లా జూన్ 23(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)**ప్రత్తిపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానిక జనసేన నాయకుడు గోపిశెట్టి శ్రీను సుమారు రూ.30 వేల విలువైన ప్రింటర్‌ను బహూకరించారు. విద్యార్థుల విద్యా అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందించిన ఈ ప్రింటర్ పాఠశాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రధానోపాధ్యాయులు చోడి జాన్ ప్రసాద్ తెలిపారు.అలాగే 2026-27 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 585 మార్కులకు పైగా సాధించే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు బహుమతి అందజేస్తానని గోపిశెట్టి శ్రీను ప్రకటించారు.దీంతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నెలకొంది.విద్యాభివృద్ధితో పాటు బడికి రాని విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించడంలో కూడా ఆయన చొరవ చూపుతున్నారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న గోపిశెట్టి శ్రీనుకు ప్రధానోపాధ్యాయులు సిహెచ్ జాన్ ప్రసాద్,ఉపాధ్యాయ బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## జనసేన పార్టీలో కొరికాన రవికుమార్ కు కీలక బాధ్యతలు

- జనసేన పార్టీ జాయినింగ్స్ కమిటీ సభ్యునిగా ,విజయనగరం సమాచార సేకరణ కమిటీ పరిశీలకునిగా నియామకం
- శుభాకాంక్షలు తెలిపిన జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కోరుకొండ మల్లేశ్వర రావు



**శ్రీకాకుళం , ప్రజాజ్యోతి న్యూస్ :**శ్రీకాకుళం సుడా చైర్మెన్ కోరికాన రవికుమార్ కు జనసేన పార్టీ అధినేత ,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పలు కీలక బాధ్యతలు అప్పగించారు. పార్టీ జాయినింగ్స్ కమిటీ సభ్యునిగా , విజయనగరం సమాచార సేకరణ కమిటీ పరిశీలకునిగా ఆయనను నియమించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కోరుకొండ మల్లేశ్వర రావు ఆయనను శ్రీకాకుళం సుడా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు పార్టీ అభివృద్ధికి , సంస్థాగత బలోపేతానికి ఆయన మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా కోరుకొండ మల్లేశ్వర రావు మాట్లాడుతూ కోరికాన రవికుమార్ కు పార్టీ అధిష్టానం అప్పగించిన ఈ బాధ్యతలు ఆయనపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్లడంలో ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల విలీనానికి పిఆర్సి కమిటీని తక్షణమే వేయాలి



**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజాజ్యోతి)**మంగళవారం నాడు బద్వేల్ సెక్షన్ నందు స్ట్రగుల్ కమిటీ పిలుపులో భాగంగా స్ట్రగుల్ కమిటీ నాయకులు వనిపెంట ప్రసాద్, సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్య క్రమం చేపట్టారు. విద్యుత్ ఉద్యోగుల ఏప్రిల్ 2026 వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో 3కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగులర్ చేయాలనీ, సంస్థలో విలీనం చేయాలని, తెలంగాణ తరహాలో కాంట్రాక్టు కార్మికుల కు కనీస వేతనం 48వేలు చెల్లించాలని, నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు, స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. అలాగే విద్యుత్ సబ్స్టేషన్లు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. యాజమాన్యం వెంటనే స్పందించి, ఉద్యోగులలో, కార్మికులతో వున్న అశాంతిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో దశరథ, రామచంద్రుడు, లోకేష్, అబ్దుల్ వలీ,ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఇష్ట రాజ్యంగా కొనసాగుతున్న మట్టి మాఫియా..!



**(ప్రజా జ్యోతి)** రాజుపాలెం మండల పరిధిలోని బీరవల్లిపాయ గ్రామంలో కొందరు దళారులు ఇష్టారాజ్యంగా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తోలుతున్నారు అదేమని అడగగా మాకు అధికారుల అండ ఉంది మా ఇష్టం వచ్చినట్లు తోలుతాం అని మాట్లాడుతున్న వైనం ఆర్ ఆర్ సెంటర్ దగ్గర మట్టి లారీ అధిక స్పీడ్ తో వెళ్తుంది చూసి స్థానికుల్లో భయం ఏర్పడుతుంది చిన్న పిల్లలు ముసలి వాళ్లు తిరుగుతున్న వాళ్లను పట్టించుకోకుండా లారీలు అధిక స్పీడ్ తో వెళుతున్నాయి అదేమని స్థానికులు అడగగా మాకు ఎక్కువ ట్రిప్ లో పడితే ఎక్కువ డబ్బులు వస్తాయి అని సమాధానం చెబుతున్నారు గట్టిగా అడిగితే మాకు అధికారుల అండ ఉంది మీ ఇష్టం వచ్చింది చేసుకోండి పత్రికా విలేకరులు అడిగిన ప్రయోజనం లేకపోయింది.

## పుట్టినరోజు వేడుకను మానవత్వంగా మార్చిన అన్నదానం




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజాజ్యోతి)** ఆడంబరాలకు పోకుండా పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమంగా మార్చి, మానవత్వాన్ని చాటుకున్నారు ఓ దంపతులు. బి.మఠం మండలం పెద్దిరాజుపల్లె గ్రామానికి చెందిన దొరబాబు, సుస్మితల కుమారుడు ఆశిష్ రామ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం బద్వేల్ పట్టణంలోని సుమిత్ర నగర్‌లో గల 'షాలోమ్ అనాధాశ్రమం'లో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా అనాథ పిల్లల మధ్య ఆశిష్ రామ్ చేత కేక్ కట్ చేయించారు. అనంతరం ఆశ్రమంలోని పిల్లలందరికీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వాహకురాలు దేవసుధ మాట్లాడుతూ.. సమాజంలో అన్నదానం అన్నిటికంటే మిన్నయైన పుణ్యకార్యమన్నారు. అనాథ పిల్లల సమక్షంలో ఇలా పుట్టినరోజు జరుపుకుని, వారికి అన్నదానం చేయడం ఎంతో సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా గుణాన్ని, దానగుణాన్ని అలవర్చుకుని నిరుపేదలను ఆదుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ వేడుకలో ఆశ్రమ నిర్వాహకులు, పిల్లలు పాల్గొని ఆశిష్ రామ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో ఇండక్షన్ స్టవ్‌ల వినియోగం తప్పనిసరి చేయాలి

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లె, జూన్ 23 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లాలోని మొత్తం 1,792 అంగన్వాడీ కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇండక్షన్ స్టవ్‌లు మరియు వంట పాత్రలు సరఫరా చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.మంగళవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రామసముద్రం అంగన్వాడీ కార్యకర్తలకు కలెక్టర్ చేతుల మీదుగా ఇండక్షన్ స్టవ్‌లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు ఆధునిక వంట సౌకర్యాలు అందించడం ప్రభుత్వ సంక్షేమ దృక్పథానికి నిదర్శనమన్నారు. ఇండక్షన్ స్టవ్‌ల వినియోగంతో వంట ప్రక్రియ సులభతరం కావడంతో పాటు సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు.అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందజేసిన ఇండక్షన్ స్టవ్‌లను తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సీడీపీవోలు, సూపర్వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు. కేంద్రాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించి సమర్థవంతంగా అమలు జరిగేలా చూడాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి హైమావతి, సిడిపివోలు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## దొడియం గ్రామంలో వైభవంగా పీర్ల పండుగ చిన్న సరిగెత్తు

భక్తుల సందడితో కళకళలాడిన దొడియం గ్రామం

సోదరభావానికి ప్రతీకగా ఘనంగా పీర్ల ఉత్సవం

పూల అలంకరణలతో ఆకట్టుకున్న పీర్లు.. భారీగా తరలివచ్చిన భక్తులు

ఆధ్యాత్మిక శోభతో సాగిన పీర్ల పండుగ వేడుకలు



**మైలవరం ప్రజా జ్యోతి న్యూస్** మైలవరం మండలం దొడియం గ్రామంలో మంగళవారం రాత్రి పీర్ల పండుగ సందర్భంగా నిర్వహించిన చిన్న సరిగెత్తు కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగింది. గ్రామంలోని పీర్లను పూలతో, విద్యుత్ దీపాలతో, రంగురంగుల అలంకరణలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దడంతో అవి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పీర్ల దర్శనం కోసం గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.సాయంత్రం నుంచి ప్రారంభమైన వేడుకలు అర్ధరాత్రి వరకు భక్తి పారవశ్యంలో కొనసాగాయి. చిన్న సరిగెత్తు కార్యక్రమంలో గ్రామ యువకులు, పెద్దలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులు పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా పీర్ల వద్ద ప్రత్యేక అలంకరణలు, దీపాలంకరణలు ఏర్పాటు చేయగా, సంప్రదాయ వాయిద్యాల నడుమ భక్తులు జైజైధ్వానాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో హిందూ, ముస్లిం సోదరభావానికి ప్రతీకగా నిలిచిన ఈ పీర్ల పండుగ వేడుకలు సామరస్య సందేశాన్ని చాటాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామ పెద్దలు, యువకులు కలిసి ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించారు.గ్రామ ప్రజల ఐకమత్యం, భక్తి భావం ప్రతిబింబించిన ఈ చిన్న సరిగెత్తు కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుని ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచింది.

## మాజీ సర్పంచ్ కంచరాన సూరన్న నాయుడిని పరామర్శించిన ఎమ్మెల్యే ఎన్.ఈ.ఆర్ తనయుడు తేజబాబు



**జి సిగడాం , ప్రజాజ్యోతి న్యూస్:**జి సిగడాం మండలం దవలపేట గ్రామ మాజీ సర్పంచ్ , విజయనగరం పార్లమెంట్ బీసీ కమిటీ అధికార ప్రతినిధి కంచారాన సూరన్న నాయుడిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వర రావు తనయుడు నడుకుదుటి తేజబాబు పరామర్శించారు. ఇటీవల సూరన్న నాయుడు అనారోగ్యానికి గురై ఆసుపత్రి లో చికిత్స పొంది తిరిగి ఇంటికి వచ్చిన నేపథ్యంలో ఈ విషయం తెలిసిన తేజ బాబు ఆయన స్వగృహానికి చేరుకుని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని , త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో జి సిగడాం బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పైల విష్ణు , రఘురాం ,వాంద్రంగి మాజీ సర్పంచ్ బూరాడ వెంకట రమణ , సంపతి వెంకట రావు ,నీటి సంఘ అధ్యక్షులు ఎన్ని శ్రీనివాస రావు ,కూటమి నాయకులు , కార్యకర్తలు తదితరులు ఉన్నారు

## మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహణ



**చింతకొమ్మ దిన్నె ప్రజాజ్యోతి శ్రీరామ్ జూన్ 23** నచికేత్ విశ్వనాథ్ మరియు డి ఎస్ పి బాలస్వామి రెడ్డి ఆదేశాల మేరకు మహిళల భద్రత, రక్షణ మరియు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలపై జరిగే నేరాల నివారణ, సైబర్ భద్రత, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళల కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ సేవలు మరియు చట్టపరమైన రక్షణల గురించి విద్యార్థినులకు వివరించారు.అలాగే మహిళలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఏలేశ్వరంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి




**కాకినాడ జిల్లా జూన్ 23(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బీపిడిపి (బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక), జీపిడిపి (గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక) 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గ్రామ,మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన,ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికల తయారీ,నిధుల సమన్వయం,గ్రామీణ అభివృద్ధి అంశాలపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో రామరాజు వర్మ,ఎంపీటీసీ సభ్యులు,మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి సిహెచ్ఎస్ ఎన్ రాజు,వ్యవసాయ అధికారి రాజేష్ ,పంచాయతీ అభివృద్ధి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రంపచోడవరంలో రేషన్ డీలర్లతో పౌరసరఫరాల శాఖ సమావేశం



**దేవీపట్నం జూన్ 23(ప్రజా జ్యోతి):-**పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంలో జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్ఓ) విజయ భాస్కర్ రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు నిత్యావసర సరుకులను సకాలంలో అందజేయాలని, ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని డీలర్లకు సూచించారు. కొత్తగా విధుల్లో చేరిన డీలర్లు నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే రేషన్ పంపిణీని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, పంపిణీలో ఎలాంటి అక్రమాలు లేదా నిర్లక్ష్యం జరిగినా సహించబోమని డీఎస్ఓ విజయ భాస్కర్ స్పష్టం చేశారు.

## పిఆర్సి కమిటీ వెంటనే వేయాలి. కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయాలి

విద్యుత్ స్ట్రగుల్ కమిటీ నిరసన కార్యక్రమం



**దువ్వూరు, జూన్ 23 ( ప్రజా జ్యోతి )** దువ్వూరు సెక్షన్ ఆఫీస్ వద్ద స్ట్రగుల్ కమిటీ పిలుపు లో భాగముగా విద్యుత్ ఉద్యోగులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ ఉద్యోగుల ఏప్రిల్ 2026 వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో 3కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగులర్ చేయాలనీ, సంస్థలో విలీనం చేయాలని, తెలంగాణ తరహాలో కాంట్రాక్టు కార్మికుల కు కనీస వేతనం 48వేలు చెల్లించాలని, నినాదాలు చేశారు. 33/11 కెవి మానింగ్ సబ్ స్టేషన్ లను ట్రైపాడ్ అగ్రిమెంట్ లో భాగంగా 2024 పిఆర్సి సందర్భంగా ప్రైవేటీకరణ చేయమని యాజమాన్యం చెప్పడం జరిగింది. మన గౌరవనీయులైన సీఎం గారు కూడా ఈ విషయం చెప్పడం జరిగినది. అయితే ఇప్పుడు ఎందుకు ప్రైవేటీకరణ కు లిస్టు సిద్ధం చేస్తున్నారు. ఇటువంటి నిర్ణయానికి తీసుకోవాలని యాజమాన్యానికి మేము డిమాండ్ చేస్తున్నాము.సమస్యలు పరిష్కారం అయ్యే వరకు, స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని వారు పేర్కొన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి, ఉద్యోగులలో, కార్మికులతో వున్న అశాంతిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు ఎన్వి రమణ, గుడిసె నరసింహులు, వెంకట కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, వినోద్, రఘురాం రెడ్డి పాల్గొన్నారు.

## మైదుకూరులో విద్యుత్ ఉద్యోగుల నిరసన

పిఆర్సి కమిటీ వెంటనే వేయాలని డిమాండ్



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజాజ్యోతి)** స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు బి.నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో ఈరోజు మైదుకూరు ఎస్పీఎం ఆవరణం నందు విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్య క్రమం చేపట్టారు. విద్యుత్ ఉద్యోగుల ఏప్రిల్ 2026 వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో 3 కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగులర్ చేయాలనీ, సంస్థలో విలీనం చేయాలని, తెలంగాణ తరహాలో కాంట్రాక్టు కార్మికుల కు కనీస వేతనం 48వేలు చెల్లించాలని, ఎస్పీఎం కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని అలాగే వారికి ఈపీఎఫ్ అమలు చేయాలని వారు నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు, స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని వారు పేర్కొన్నారు. అలాగే ట్రైపాడ్ అగ్రిమెంట్ ప్రకారం 2024 పిఆర్సి సందర్భంగా యాజమాన్యం మరియు యూనియన్లు ఒప్పందంలో భాగంగా మ్యానింగ్ సబ్ స్టేషన్లు యధా స్థానంలో ఉంచుతామని చెప్పడం జరిగినది. ప్రస్తుతము ఆ సబ్ స్టేషన్లు ప్రైవేటీకరణ చేయాలని ఆలోచనలో ఉండడం మంచిది కాదని వారు డిమాండ్ చేశారు. యాజమాన్యం వెంటనే స్పందించి, ఉద్యోగులలో, కార్మికులతో వున్న అశాంతిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మైదుకూరు స్ట్రగుల్ కమిటీ నాయకులు సుధాకర్ రెడ్డి, గుద్దేటి సుబ్బరాయుడు, నాగేశ్వర్ రెడ్డి, జెల్లీ రమణ, మనోజ్ డేవిడ్ రాజు, బాలకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు

- ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంతోమంది నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారు
- ఎక్కువ శాతం మంది లుగా ఎంపిక అవుతున్నారు
- దూసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకులి 26 ఉచిత సైకిళ్ల పంపిణీ
- ఎమ్మెల్యే కూన రవికుమార్






**ఆమదాలవలస ,ప్రజాజ్యోతి న్యూస్:** ఆమదాలవలస మండలం దూసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేశారు. చిగురిపల్లి ప్రభాకర్ రావు మాస్టారు ఆర్థిక సహకారంతో అందించిన 26 సైకిళ్లను ఆముదాల వలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీ కూన రవికుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పాఠశాలకు సకాలంలో చేరేందుకు సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థుల చదువుకు దూరం అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఇటువంటి సహాయ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించడం సమాజ బాధ్యత అని తెలిపారు. చిగురుపల్లి ప్రభాకర్ రావు మాస్టారు అందించిన ఆర్థిక సహకారం ద్వారా 26 మంది విద్యార్థులకు సైకిళ్లు అందడం సంతోషకరమని, ఈ సైకిళ్లను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు.సైకిళ్లు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ సహకరించిన చింతాడ ప్రభాకర్ రావు మాస్టారికి, పంపిణీ చేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాలో జల వనరుల పెంపుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలి

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ట్యాంక్ టు ట్యాంక్ కనెక్టివిటీ అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేయాలి
వర్షపు నీటి ప్రతి బొట్టును ఒడిసి పట్టి భూగర్భ జలాలు పెంచాలి
చెరువులు, కుంటలు, రిజర్వాయర్ల నింపుదలపై ప్రత్యేక దృష్టి సారించాలి





**మదనపల్లి, జూన్ 23 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లాలో రానున్న వర్షాలను సమర్థవంతంగా వినియోగించుకుని జల వనరుల పెంపు దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.మంగళవారం మదనపల్లి కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రత్యేక అధికారులు, డ్వామా, ఇరిగేషన్, సాగునీటి శాఖ ఏఈలు, ఏపీడీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జల వనరుల పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ, ప్రవాహాల మళ్లింపు, చెరువుల పునరుద్ధరణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యాచరణ ప్రణాళికలను వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులను అత్యంత ప్రాధాన్యంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.జూన్ నెల చివరి వారానికి చేరుకున్నప్పటికీ జిల్లాలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 52 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. ఈ పరిస్థితి కొనసాగితే తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశమున్నందున చెరువులు, జల వనరులు, భూగర్భ జలాల పునరుద్ధరణకు సంబంధించిన అన్ని క్షేత్రస్థాయి ధృవీకరణ (ఫీల్డ్ వెరిఫికేషన్) పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. వర్షపు నీరు ఒక్క శాతం కూడా వృథా కాకుండా నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వాటర్‌షెడ్, సోర్స్ కనెక్షన్లు, క్రాస్ కనెక్షన్లు, బేసిన్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించి అవసరమైన పనులను వెంటనే అమలు చేయాలన్నారు. ఇప్పటికే మంజూరైన పనులను వేగవంతం చేయడంతో పాటు అవసరమైన చోట టెండర్ల ప్రక్రియను ముందస్తుగా ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు దాతలను (డోనర్స్) విస్తృతంగా సమీకరించాలని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రాబోయే వర్షాకాలాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ప్రధాన నదుల్లో పూర్తి స్థాయి ప్రవాహాలు ప్రారంభమయ్యే వరకు చిన్న వాగులు, స్ట్రీమ్స్, సీజనల్ వాటర్ ఛానల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వృథాగా వెళ్లిపోతున్న నీటిని చెరువులు, ట్యాంకులు, రిజర్వాయర్లకు మళ్లించడం ద్వారా తాగునీరు, సాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.ట్యాంక్ టు ట్యాంక్ కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొంటూ, ఫీడర్, లింక్ ఛానల్స్ అభివృద్ధి ద్వారా వరుసగా పలుచెరువులు నింపే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో ప్రధాన వాగులు, వాటి ప్రవాహ సామర్థ్యంపై పూర్తి స్థాయి మ్యాపింగ్ సిద్ధం చేయాలని సూచించారు.జిల్లాలో తాగునీటి అవసరాలు, భూగర్భ జలాల పెంపు, సాగునీటి భద్రత దృష్ట్యా ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమన్వయంతో పని చేస్తే ఈ ఏడాది జల వనరులను గణనీయంగా పెంచే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి,మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్డీవో శ్రీనివాస్, డ్వామా పిడి వెంకటరత్నం,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ నారాయణ, పశుసంవర్ధక శాఖ అధికారి,రిటైర్డ్ ఇరిగేషన్ ఎస్సీ వెంకట్రామయ్య, ఎంపీడీవోలు, ఫారెస్ట్ అధికారులు, డ్వామా, ఇరిగేషన్, సాగునీటి శాఖ ఏఈలు, ఏపీడీలు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలులో జనసేన సీనియర్ నాయకుడు తలా శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ!





భారీగా తరలివచ్చిన జనసేన నాయకులు, కేక్ కట్ చేసి, శాలువాతో ఘనంగా సత్కరించిన పార్టీ శ్రేణులు.

**కాకినాడ జిల్లా, గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు పట్టణ జనసేన పార్టీ సీనియర్ నాయకుడు తలాలి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలో అత్యంత ఘనంగా వైభవంగా జరిగాయి. గొల్లప్రోలు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మామిడాల సూరిబాబు జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా . పార్టీ శ్రేణులు, జనసైనికులు ఈ కార్యక్రమాన్ని ఒక పండుగలా నిర్వహించారు.

**వైభవంగా కేక్ కటింగ్.. శుభాకాంక్షల వెల్లువ**

ఈ సందర్భంగా గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుడు మామిడాల సూరిబాబు ఆధ్వర్యంలో తలాలి శ్రీనివాస్ చేత భారీ కేక్‌ను కట్ చేయించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన జనసేన పార్టీ సీనియర్ నాయకులు, తలాలి శ్రీనివాస్‌కు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.. రాబోయే రోజుల్లో ఆయన రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజాసేవలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు.తలాలి శ్రీనివాస్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పేందుకు నాయకులు భారీగా తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ఈ సందర్భంగా వచ్చిన వారందరికీ మిఠాయిలు పంచిపెట్టి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# మెట్రో కష్టాలు ఇంతింతకాదయా

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయంలో ఆర్భాటంగా ప్రకటనలు చేస్తూ, తర్వాత కేంద్రం అడ్డుపడుతోందని ఆరోపిస్తున్నారు. ఇది రాజకీయ డైవర్షన్‌గా మారిందని విమర్శలు వస్తున్నాయి. అయితే వాస్తవాలు, ఆర్థిక సవాళ్లు, కేంద్ర?రాష్ట్ర సంబంధాలను పరిశీలిస్తే ఈ విషయం మరింత సంక్లిష్టంగా కనిపిస్తుందిహైదరాబాద్ మెట్రో ఫేజ్?1ను ఎల్‌అండ్‌టీ నిర్వహిస్తోంది. ఇది నష్టాల్లో ఉండటం, ఆర్థిక భారం కారణంగా లీజ్ వదులుకోవాలని నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం దీనిని స్వాధీనం చేసుకుని, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ద్వారా 100 శాతం ఈక్విటీని సొంతం చేసుకుంది. ఇందుకు సుమారు రూ.1,461 కోట్లు ఖర్చు అయింది. ఎల్‌అండ్‌టీకి చెల్లించాల్సిన బకాయిలు, రుణాలు క్లియర్ చేయడం ఈ టేకోవర్‌కు ముఖ్య కారణం. ఇది ఫేజ్?2 విస్తరణకు మార్గం సుగమం చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఎవరూ సూచించకుండానే టేకోవర్ చేశారని, రాజకీయ నేపథ్యం ఉందని విమర్శలు ఉన్నాయి.రూ.13,600 కోట్ల వరకు ఉన్న రుణాలు, ఇవి ఇంతకు ముందు బ్యాంకుల నుంచి 8.25% వడ్డీకి తీసుకున్నవి. ప్రభుత్వం ఇప్పుడు ఐఆర్‌ఎఫ్‌సీ (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) ద్వారా రీఫైనాన్సింగ్ చేయాలని చూస్తోంది. దీనిలో 4% వడ్డీకి జపాన్ నుంచి నిధులు వచ్చే అవకాశం ఉంది. కేంద్రం ఎఫ్‌ఆర్‌బీఎం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) నిబంధనల ప్రకారం రుణం తీసుకోవాలని సూచిస్తోంది. ఇలా చేస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంకా దెబ్బతింటుంది. ఉద్యోగుల జీతాలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కొరత ఏర్పడవచ్చు. రాష్ట్ర హామీతో రుణం తీసుకుంటే అది రాష్ట్ర బడ్జెట్‌పై భారం అవుతుంది. ఇది టేకోవర్‌ను ఆర్థికంగా సవాలుగా మార్చింది.మెట్రో ఫేజ్?2 (సుమారు 123 కి.మీ.,రూ.38,595 కోట్లు) కోసం రేవంత్‌రెడ్డి కేంద్రం నుంచి నిధులు, ఆమోదాలు కోరుతున్నారు. ఇంతకు ముందు 50:50 భాగస్వామ్యంగా ఒప్పందం జరిగిందని చెబుతున్నారు. కానీ యూనియన్ మినిస్టర్ గిరి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆరోపిస్తున్నారు.ఫేజ్?2కు నిధులు తీసుకురావడం ద్వారా టేకోవర్ బకాయిలు చెల్లించాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. కిషన్ రెడ్డి మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు పాటించడం లేదు, ఆర్థిక బాధ్యతలు తీసుకోవడం లేదు అని ఆరోపిస్తున్నారు. వాదనలు వస్తున్నాయి. ఇది కేంద్ర?రాష్ట్ర రాజకీయాల్లో భాగమైంది. మెట్రో ఫేజ్?2 విస్తరణ ట్రాఫిక్ సమస్యలను తగ్గించవచ్చు. అయితే ఆర్థిక భారం, రుణాలు, కేంద్ర నిబంధనలు ఇది సులభం కాదని చూపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం టేకోవర్‌ను గొప్ప విజయంగా చిత్రించి, తర్వాత కేంద్రం మీద బాధ్యత వేయడం రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. అదే సమయంలో కిషన్‌రెడ్డి, కేంద్రం వైపు నుంచి రాష్ట్రం నిబంధనలు పాటించాలని, ఆర్థిక బాధ్యత తీసుకోవాలని ఒత్తిడి చేయడం సహజం. ఈ ప్రాజెక్టు కేంద్ర, రాష్ట్రాలు కలిసి చేయాల్సినది. రాజకీయ ఆరోపణలు, డైవర్షన్‌లు పక్కన పెట్టి, ఆర్థిక వాస్తవాలు, ప్రజా ప్రయోజనం ఆధారంగా ముందుకు సాగాలి. హైదరాబాద్ వంటి నగరానికి మెట్రో విస్తరణ అవసరం ఉంది, కానీ అది రాష్ట్ర ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీయకుండా జరగాలి.ఇలాంటి పెద్ద ప్రాజెక్టుల్లో రాజకీయాలు అనివార్యం. కానీ ప్రజలు ఫలితాలు చూడాలని కోరుకుంటారు. మెట్రో విస్తరణ, మెరుగైన రవాణా. రెండు పక్షాలు సహకరించి, సమస్యలను పరిష్కరించుకోవాలి. అప్పుడే ఈ టేకోవర్ నిజమైన అభివృద్ధికి దారితీస్తుంది.



# రాయచోటి ప్రైవేట్ జూనియర్ కాలేజీ లపై చర్యలు తీసుకోవాలని పి డి ఎస్ యు డిమాండ్

శెట్టిపల్లి సాయికుమార్ పి డి ఎస్ యు అన్నమయ్య జిల్లా నాయకులు



**రాయచోటి జూన్ 23 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం లో ఉన్న ప్రైవేట్ జూనియర్ కాలేజీలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రాయచోటి జగదాంబ సెంటర్లో ఒకే బిల్డింగ్లో ఇంటర్, డిగ్రీ, పారా మెడికల్, కోచింగ్ సెంటర్ల పేర్లతో నడుస్తున్న మరోవైపు కాలేజీ పేరు మార్చుకొని సిట్టింగ్ ఆర్డర్లో లేకుండా పట్టణంలో ఉన్న జూనియర్ కాలేజీలలో కనీస మౌలిక సదుపాయాలు లేకుండా వేలకు వేల రూపాయలు ఫీజులు తీసుకుంటున్న ఆర్ఐఓ రవి కుమార్ పుస్తకాల పేర్లతో వేలకు వేల రూపాయలకు అమ్ముతున్నారని అనేకమైన సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు తక్షణం కలెక్టర్ గారు స్పందించి విచారణ కమిటీ వేసి సమగ్ర నివేదిక తెప్పించుకొని జూనియర్ కాలేజీ లపై చర్యలు తీసుకోవాలని పి డి ఎస్ యు గా డిమాండ్ చేస్తున్నాం లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలియజేస్తున్నాం ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు నాయకులు, లోకేష్, మధు పాల్గొన్నారు.

# నెల్లిపాకలో వైభవంగా శ్రీ త్రిముఖ ప్రసన్న దుర్గాదేవి ప్రతిష్ఠా మహోత్సవాలు

మూడు రోజుల పాటు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్త పూజలు

భక్తులకు ఆలయ కమిటీ ఆహ్వానం



**ఎటపాక, జూన్ 23 (ప్రజాజ్యోతి):** ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో కూనవరం వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కన నూతనంగా నిర్మించిన శ్రీ త్రిముఖ ప్రసన్న దుర్గాదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, గోపుర నిర్మాణ శోభా కార్యక్రమాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో మూడు రోజుల పాటు వేద పండితుల మంత్రోచ్చారణలు, శాస్త్రోక్త పూజా కార్యక్రమాల నడుమ ఉత్సవాలు జరగనున్నాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయ గోపురం పూర్తికావడంతో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ స్థాపన కార్యక్రమాలను ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, జపాలు, కలశారాధనలు, పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మహోత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు, తిరువీధుల మల్లికార్జునరావు కోరారు.

# కాశ్మీర్ అఖండత్వం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



**కూనవరం, జూన్ 23: ప్రజా జ్యోతి** దేశ సమైక్యత, అఖండత్వ పరిరక్షణ కోసం "ఒకే దేశం ఒకే రాజ్యాంగం ఒకే జెండా" అనే లక్ష్యంతో పోరాడి ప్రాణాలర్పించిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ సందర్భంగా కూనవరం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా వ్యతిరేకంగా దేశ సమగ్రత కోసం డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం భారత చరిత్రలో చిరస్మరణీయమని కొనియాడారు. దేశ ఏకత్వం, సమానత్వం కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూనవరం బీజేపీ మండల అధ్యక్షులు కరక పవన్ కుమార్, సీనియర్ నాయకులు నోముల రామారావు, గీదా శ్రీనివాసరావుతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొని డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. "దేశ అఖండత్వం కోసం బలిదానం చేసిన మహనీయుల త్యాగాలను స్మరిస్తూ, వారి ఆశయ సాధనకు కట్టుబడి పనిచేయడం ప్రతి భారతీయుడి బాధ్యత" అని నాయకులు పేర్కొన్నారు.

# బంగారు పీరు ఊరేగింపు

**దువ్వూరు,జూన్ 23 ( ప్రజా జ్యోతి )**



దువ్వూరు మండల కేంద్రంలోని కొత్త కొట్టాలు వీధిలో మొహర్రం పండుగ 7వ రోజు సందర్భంగా మంగళవారం హజరత్ ఇమాం ఖాసీం ( బంగారు పీరు ) ఊరేగింపు చేశారు. అనంతరం పీరు అగ్ని గుండంలోకి ప్రవేశించింది. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.నేడు రాత్రి 11:30 గంటలకు బాదుల్ల పీరు ఊరేగింపు జరుగుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా కానుక అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి

అధిక ధరలకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నటువంటి బుక్ స్టాల్ ని సీజ్ చేయాలి

వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కసాపురం వంశీ యాదవ్



**గుంతకల్లు జూన్ 23 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా కానుక అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి, అధిక ధరలకు పాఠ్యపుస్తకా లను విక్రయిస్తున్నటువంటి బుక్ స్టాల్ ని సీజ్ చేయాలని వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కసాపురం వంశీ యాదవ్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి క్యాంపు కార్యాలయంలో విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు నక్క నారప్ప అధ్యక్షతన వైయస్సార్ విద్యార్థి విభాగం నాయకులు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కసాపురం వంశీ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పాఠశాలలో తెరిచి పది రోజులు పూర్తయిన ఇంతవ రకు ఒక విద్యార్థి కూడా విద్యా కానుక కిట్లు ఇవ్వలే నటువంటి పరిస్థితి మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉంది విద్యా బోధన అయి పది రోజులు పూర్తవుతున్నప్పటికీ ఇంతవరకైనా పాఠ్యపుస్తకాలు లేకపోతే విద్యార్థులు ఏ విధంగా చదువును అభ్యసి స్తారని ప్రశ్నిస్తూ వైయస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి మరియు మంత్రి నారా లోకేష్ కి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల మీద ఉన్న వ్యామోహం ప్రభుత్వ పాఠశాలలపై లేదని పేర్కొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి






ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ


**అన్నమయ్య జిల్లా జూన్ 23 ప్రజా జ్యోతి** రాష్ట్రంలో గత రెండు సంవత్సరాల పాలనలో భవన నిర్మాణ కార్మికులు, ఉద్యోగులు, రైతులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ విమర్శించారు. మంగళవారం పీలేరు మండల భవణ నిర్మాణ కార్మిక సంఘం సమావేశం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నర్సింహులు అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల లక్షలాది మంది కార్మికులు నష్టపోయారని, ఈ అన్యాయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే సరిదిద్దాలని ఆయన డిమాండ్ చేశారు.భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన నిధులను తిరిగి సంక్షేమ బోర్డులో జమ చేసి, ఆ నిధులను పూర్తిగా కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని కోరారు. సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయకుండా పటిష్టంగా అమలు చేసి, నమోదు, పునరుద్ధరణ, ప్రమాద బీమా, ప్రసూతి సహాయం, విద్యా సహాయం, మరణ పరిహారం వంటి అన్ని సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.భవన నిర్మాణ కార్మికులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించి, బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.అలాగే రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని, ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను శాశ్వతీకరించకపోవడం, ప్రజా రంగ సంస్థలను బలహీనపరచడం ఆందోళనకరమని అన్నారు.పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారం, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణ కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు.ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వం విడనాడి, కార్మికులు, ఉద్యోగులు, రైతులు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, లేకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వెంకటేష్, ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి నర్సింహులు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యురాలు కవిత, దామోదర్, రెడ్డి భాషా,మార్కొండా రెడ్డి, శామీర్,రాజ్ కుమార్, అజయ్,మదార్,శశివర్ధన్ తదితరులు పాల్గొన్నారు

# ప్రెస్ క్లబ్ 6వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత....!!





**జి.కొండూరు :( జూన్ 23,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):**మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మంగళవారం ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ 6వ వార్షికోత్సవ వేడుకల్లో పోల్గొన్నారు.ఈ సందర్భంగా జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వర్ణ కన్వెన్షన్ హాల్‌లో శ్రీకర హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు ప్రారంభించారు. కేకును కట్ చేశారు. ఎమ్మెల్యేని జర్నలిస్టులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నార న్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా చేస్తున్న సేవలు అమూల్యమైనవని కొనియాడారు. నిష్పాక్షికంగా వార్తలను అందిస్తూ ప్రజలకు మార్గదర్శకులుగా నిలుస్తున్న జర్నలిస్టులకు సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ ఆరు సంవత్సరాలుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.శ్రీకర హాస్పిటల్స్ విజయవాడ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్, కార్డియాలజీ, జనరల్ సర్జరీ, నేత్ర వైద్యం, క్రిటికల్ కేర్, న్యూరో సర్జరీ, చర్మవ్యాధులు, గైనకాలజీ తదితర విభాగాలకు చెందిన నిపుణ వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించి వైద్య సూచనలు అందించారు. గుండె, కిడ్నీ, ఎముకలు, కీళ్లు, ఊపిరితిత్తులు, కంటి సమస్యలు, మధుమేహం తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి



ప్రత్యేక వైద్య సేవలు అందించారు.అలాగే ఈసీజీ, షుగర్, 2డీ ఎకో, బీఎండీ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించగా, అవసరమైన రోగులకు మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ప్రజలు శిబిరంలో పాల్గొని వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, తదితరులు పోల్గొన్నారు.

# బిజినెస్

## ఫోన్‌లో నంబర్ సేవ్ చేయకుండానే వాట్సాప్‌లో మెసేజ్ పంపవచ్చు.. ఎట్లనో తెలుసా..!




మెసేజింగ్ సోషల్ మీడియా యాప్ వాట్సాప్ గురించి తెలియని వాళ్లు చాలా తక్కువ. స్మార్ట్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరు వాట్సాప్‌ను వినియోగిస్తారు. ఈ యాప్‌లో ఫోటోలు, వీడియోలతోపాటు కాల్స్ చేసుకొనే వెసులుబాటు కూడా ఉంటుంది. అందుకే ఎక్కువగా వాట్సాప్‌ను ఉపయోగిస్తారు. ఈ వాట్సాప్ ఎప్పటికప్పుడు వినూత్న అప్‌డేట్స్‌తో ముందుకు వస్తుంది. సాధారణంగా అయితే మన కాంటాక్ట్ లిస్టులో లేని వ్యక్తికి వాట్సప్‌లో ఏదైనా పంపాలంటే ముందుగా అతని నెంబర్ సేవ్ చేసుకోవాలి. కానీ ఇప్పుడు ఆ అవసరం లేదు. నంబర్ సేవ్ చెయ్యకుండానే కొత్త వాళ్లకు మెసేజ్ పంపవచ్చు. వాట్సప్ సర్చ్ బార్ ఫీచర్ (ఔఫ్‌రాూజూజూ ంఘుతీఎష్ట్ర ఘుతీ టమ్షుబతీవ) అందుబాటులోకి రావడంతో నంబర్ సేవ్ చేయాల్సిన అవసరం తప్పింది. ఆ ఫీచర్‌ను యాక్టివేట్ చేసుకుంటే నంబర్ సేవ్ చేయకుండానే మెసేజ్ పంపవచ్చు. అదెట్లనో ఇప్పుడు తెలుసుకుందాం..

సేవ్ చేయని నెంబర్‌కు మెసేజ్ పంపడం ఇలా..

ముందుగా మన మొబైల్ ఫోన్‌లోని వాట్సాప్ యాప్‌ను ఓపెన్ చేయాలి.

ఐఫోన్ యూజర్లైతే వాట్సాప్ యాప్ పైభాగంలో ప్లస్ ఐకాన్ ఉంటుంది. ఆండ్రాయిడ్ యూజర్లైతే కింద ప్లస్ ఐకాన్ ఉంటుంది. ఆ ఐకాన్‌పై క్లిక్ చేయాలి.

ఆ తర్వాత సెర్చ్ కాంటాక్ట్‌పై క్లిక్ చేసి మెసేజ్ పంపదల్చుకున్న నంబర్‌ను కాపీ చేసి అక్కడ పేస్ట్ చేయాలి.

ఆ నెంబర్‌కు వాట్సాప్ అకౌంట్ ఉంటే చాట్ ఆప్షన్ కనిపిస్తుంది. ఇక ఆ నంబర్‌తో వాట్సాప్ మెసేజ్ చెయ్యవచ్చు.

ఇవేగాక వాట్సాప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్స్‌తో కస్టమర్లను ఆకట్టుకుంటుంది.

## స్టాక్ మార్కెట్లు భారీ పతనం.. సెన్సెక్స్ 893 పాయింట్లు లాస్



భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 893 పాయింట్లు, నిఫ్టీ 278 పాయింట్లు నష్టపోయాయి. ఉదయం ట్రేడింగ్ 57 పాయింట్ల నష్టంతో 77,061 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ కూడా 31 పాయింట్ల నష్టంతోనే ప్రారంభమైంది. ఉదయం నుంచి కొనసాగిన లాస్ ట్రెండ్ ట్రేడింగ్ ముగిసే వరకు కొనసాగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 893.39 పాయింట్లు (1.16 శాతం) నష్టపోయి 76,200.68 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 278.80 పాయింట్లు (1.16%) కోల్పోయి 23,824.10 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.74 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 77.49 డాలర్ల వద్ద కొనసాగింది. ఔన్స్ బంగారం ధర 4130 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈ సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, పవర్ గ్రిడ్, మారుతీ సుజుకి షేర్లు లాభాలు పొందగా, ఐటీ స్టాక్స్ తీవ్రంగా నష్టపోయాయి. ఇన్ఫోసిస్ షేర్లు 3.36 శాతం, టీసీఎస్ 3.16 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.79 శాతం, టెక్ మహీంద్రా 1.31 శాతం నష్టపోయాయి. అలాగే, బీఈఎల్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ కూడా భారీగా నష్టపోయాయి. మెటల్ స్టాక్స్ కూడా నష్టాల్లోనే కొనసాగాయి. ఫార్మా షేర్లు మాత్రం స్వల్పంగా లాభాలు పొందాయి. ఇండియాతోపాటు జపాన్, ఇతర ఆసియా మార్కెట్లు, అంతర్జాతీయా మార్కెట్లు కూడా మంగళవారం నష్టాల్లోనే ముగిశాయి.

# దేశంలో 109 కోట్లు దాటిన ఇంటర్నెట్ యూజర్స్ ట్రాయ్ తాజా నివేదికలో వెల్లడి



భారత టెలికామ్ రంగం అప్రతిహత వృద్ధిని కొనసాగిస్తోంది. దేశంలో ఇంటర్నెట్, టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం.. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 109.27 కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 102.86 కోట్లుగా ఉండగా.. కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం వృద్ధి నమోదైంది. ట్రాయ్ నివేదిక ప్రకారం.. మొత్తం ఇంటర్నెట్ వినియోగదారులలో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ ద్వారా, 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు. వీరిలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 106.58 కోట్లుగా ఉండగా.. న్యారోబ్యాండ్ (56 కేబీపీఎస్ కంటే తక్కువ వేగం) సబ్‌స్క్రైబర్లు 2.69 కోట్లుగా ఉన్నారు. త్రైమాసిక ప్రాతిపదికన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల బేస్ 5.81 శాతం పెరగడం విశేషం. ఇంటర్నెట్‌తోపాటు మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా 133.05 కోట్లకు పెరిగింది. దాంతో దేశవ్యాప్తంగా టెలి–డెన్సిటీ (ప్రతి 100 మందికి ఉన్న ఫోన్ కనెక్షన్లు) గత త్రైమాసికంలోని 91.74 శాతం నుంచి 93.26 శాతానికి మెరుగుపడింది. వైర్‌లైన్ టెలిడెన్సిటీ సైతం 3.33 శాతం నుంచి 3.38 శాతానికి పెరిగింది. వినియోగదారుల నుంచి వచ్చే సగటు నెలవారీ ఆదాయం కూడా టెలికామ్ సంస్థలకు సానుకూలంగా ఉంది. వైర్‌లెస్ సేవలకు సంబంధించి ఏఆర్‌పీయూ 0.76 శాతం పెరిగి రూ.196.04కి చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 7.15 శాతం పెరుగుదల. అదేవిధంగా వినియోగ సమయం కూడా స్వల్పంగా పెరిగి నెలకు సగటున 1,017 నిమిషాలకు చేరింది. టెలికామ్ రంగం వృద్ధి ప్రభుత్వ ఆదాయానికి కూడా ఊతమిచ్చింది. 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో టెలికామ్ కంపెనీల నుంచి లైసెన్స్ ఫీజు రూపంలో ప్రభుత్వానికి రూ.6,936 కోట్ల ఆదాయం లభించింది. అంతకుముందు త్రైమాసికంలో ఇది రూ.6,733 కోట్లుగా ఉంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అనుమతి పొందిన 917 ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానెళ్లు దేశంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయని కూడా ట్రాయ్ తన నివేదికలో పేర్కొన్నది.

# బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.41 లక్షల కోట్ల నగదు విడుదల చేసిన ఆర్బీఐ




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇవాళ బ్యాంకింగ్ వ్యవస్థ లోకి భారీగా నగదును విడుదల చేసింది. ఏడు రోజుల వీఆర్ఆర్ వేలం ద్వారా రూ.1.41 లక్షల కోట్ల తాత్కాలిక నిధులను విడుదల చేసింది. జీఎస్టీ చెల్లింపుల కారణంగా వ్యవస్థలో ఏర్పడిన నగదు కొరతను అధిగమించేందుకు ఆర్‌బీఐ ఈ చర్యలు చేపట్టింది. ఇటీవలి జీఎస్టీ చెల్లింపుల వలన బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో నగదు బయటకు వెళ్లింది. దాంతో బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత ఒక్కసారిగా పడిపోయింది. జూన్ 21న రూ.30,685 కోట్ల మిగులుతో ఉన్న వ్యవస్థ జూన్ 22 నాటికి రూ.19,971 కోట్ల లోటుకు చేరుకుంది. ఈ పరిణామంతో స్వల్పకాలిక మనీ మార్కెట్ వడ్డీ రేట్లపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. సగటు కాల్ మనీ రేటు 5.43 శాతానికి చేరింది. ఇది ఆర్‌బీఐ రెపో రేటు కన్నా 0.18 శాతం ఎక్కువ. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఆర్‌బీఐ, వ్యవస్థలో తగినంత నగదు ఉండేలా చర్యలు తీసుకుంది. 5.26 శాతం కటాఫ్ రేటుతో బ్యాంకులకు నిధులను అందించింది. ఇలాంటి సమయాల్లో ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోతే నిధుల సమీకరణ వ్యయం పెరిగి, ఆర్థిక వ్యవస్థలో రుణ ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. ఇది ఆర్థిక మందగమనానికి దారితీసే ప్రమాదం ఉంది. ఆర్‌బీఐ సాధారణంగా పన్ను చెల్లింపులు, ముందస్తు పన్ను చెల్లింపులు లేదా ఇతర కాలానుగుణ రుణ డిమాండ్ వంటి కారణాలవల్ల ఏర్పడే స్వల్పకాలిక నగదు లోటును సరిచేయడానికి వివిధ ద్రవ్య విధాన సాధనాలను ఉపయోగిస్తుంది. తాత్కాలిక నగదు అవసరాల కోసం వీఆర్ఆర్ వేలాలను నిర్వహిస్తుంది. దీనికింద బ్యాంకులు తమవద్ద ఉన్న ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్‌బీఐ వద్ద తాకట్టు పెట్టి నిధులు పొందుతాయి. ఇక దీర్ఘకాలిక ద్రవ్య లభ్యత కోసం ఆర్‌బీఐ సెకండరీ మార్కెట్ నుంచి ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయడం లేదా డాలర్–రూపాయి స్వాప్ వేలాలను నిర్వహించడం వంటి చర్యలు చేపడుతుంది. తాజా చర్యతో బ్యాంకింగ్ వ్యవస్థలో స్వల్పకాలిక నిధుల ఒత్తిడి తగ్గి, ఆర్థిక కార్యకలాపాలు సజావుగా సాగేందుకు మార్గం సుగమమైంది.

# మరో టీ20 లీగ్ సంబరం.. టీమిండియా స్టార్లు రెడీ!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రవేశపెట్టిన తర్వాత భారత్‌లో టీ20 ఫార్మాట్‌కు ఆదరణ మరింతగా పెరిగింది. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాలు స్థానికంగా టీ20 లీగ్‌లు నిర్వహిస్తూ దేశీ ఆటగాళ్లకు చక్కటి వేదిక కల్పిస్తున్నాయి. ఇప్పటికే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ, బెంగాల్ టీ20 లీగ్‌లు నిర్వహిస్తుండగా.. ఇటీవలే తెలంగాణ కూడా ఈ జాబితాలోకి చేరింది.

**మరో టీ20 లీగ్ సంబరం**

టీజీ20 పేరిట హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహిస్తోంది. జూన్ 21న మొదలైన ఈ లీగ్ జూలై 12న ఫైనల్‌తో ముగియనుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఢిల్లీ ప్రీమియర్ లీగ్ (ఐూూ) షెడ్యూల్ విడుదలైంది. డీపీఎల్ మూడో ఎడిషన్‌ను జూలై 31 నుంచి ఆగష్టు 30 మధ్య నిర్వహించనున్నట్లు ఢిల్లీ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ మంగళవారం వెల్లడించింది. ఈసారి కూడా టీమిండియా స్టార్లు ఈ లీగ్‌లో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు.

**టీమిండియా స్టార్లు సిద్ధం**

భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్‌తో పాటు.. హర్షిత్ రాణా డీపీఎల్‌లో భాగం కానున్నాడు. వీరితో పాటు టీమిండియా వెటరన్ పేసర్లు ఇషాంత్ శర్మ, నవదీప్ సైనీ కూడా లీగ్ ఆడనున్నారు. ఇక ఐపీఎల్ స్టార్లు నితీశ్ రాణా, ఆయుశ్ బదోని, ప్రియాన్ష్ ఆర్య, సూయశ్ శర్మ, దిగ్వేశ్ రాఠీ, ప్రిన్స్ యాదవ్, యశ్ ధుల్, అనూజ్ రావత్, సిమర్జీత్ సింగ్, హిమ్మత్ సింగ్, హృతిక్ షోకీన్, సార్థక్ రంజన్ తదితరులు డీపీఎల్ బరిలో దిగనున్నారు. అనుభవజ్ఞులైన, యువ ప్లేయర్లతో సమతూకం చేసుకుంటూ ఫ్రాంఛైజీలు తమ జట్లను తయారుచేసుకున్నాయి.

**మహిళల లీగ్ కూడా..**

ఇక మహిళల డీపీఎల్‌ను ఈసారీ ఆటంకాలు లేకుండా కొనసాగించనున్నారు. శ్వేతా సెహ్రావత్, ప్రియా పునియా, సోని యాదవ్, ఆయుశి సోని తదితరులు ఇందులో భాగం కానున్నారు. వీరితో పాటు రైజింగ్ స్టార్లు తనీషా సింగ్, నజ్మా, మోనికా, పూర్వా సివాచ్ కూడా లీగ్లో ఆడనున్నారు.

కాగా పురుషుల డీపీఎల్‌లో గతేడాది.. నితీశ్ రాణా సారథ్యంలో వెస్ట్ ఢిల్లీ లయన్స్ విజేతగా నిలిచింది. మహిళల విభాగంలో శ్వేతా సెహ్రావత్ కెప్టెన్సీలో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్ చాంపియన్‌గా అవతరించింది.

**డీపీఎల్–2026లో పాల్గొనే పురుష జట్లు**

సెంట్రల్ ఢిల్లీ కింగ్స్, ఈస్ట్ ఢిల్లీ రైడర్స్, న్యూ ఢిల్లీ టైగర్స్, నార్త్ ఢిల్లీ స్ట్రైకర్స్, ఔటర్ ఢిల్లీ వారియర్స్, పురానీ ఢిల్లీ 6, సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్, వెస్ట్ ఢిల్లీ లయన్స్.

**మహిళల జట్లు**

సెంట్రల్ కింగ్స్ వుమెన్, ఈస్ట్ ఢిల్లీ రైడర్స్ వుమెన్, సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్ వుమెన్, నార్త్ ఢిల్లీ స్ట్రైకర్స్ వుమెన్.

## పదిహేనేళ్లు మాతోనే ఉంటాడు!.. రెండేళ్లకే వదిలేశారుగా




ఊహాగానాలే నిజమయ్యాయి. లక్నో సూపర్ జెయింట్స్ తమ కెప్టెన్ రిషభ్ పంత్‌ను వదులుకుంది. ఈ వికెట్ కీపర్ బ్యాటర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్‌కి ట్రేడ్ చేసి బదులుగా.. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకుంది. కాగా ఐపీఎల్–2025 మెగా వేలంలో భాగంగా లక్నో పంత్ కోసం ఇతర ఫ్రాంఛైజీలతో పోటీపడ్డ సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎక్కడా తగ్గకుండా ధరను పెంచుకుంటూ పోయిన లక్నో.. ఏకంగా రూ. 27 కోట్లకు పంత్‌ను సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్లేయర్‌గా అతడు నిలిచాడు. ఇక పంత్‌ను తమ జట్టు కెప్టెన్‌గా నియమించిన లక్నోకు రెండు సీజన్లలో తీవ్రమైన నిరాశే మిగిలింది. గతేడాది పంత్ కెప్టెన్సీలో పద్నాలుగు ఆరు మ్యాచ్‌లే గెలిచిన లక్నో.. ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. వ్యక్తిగతంగా పంత్ 14 మ్యాచ్‌లలో కలిపి కేవలం 269 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇక ఈ ఏడాది 13 ఇన్నింగ్స్‌లో కలిపి కేవలం 312 పరుగులు చేసిన పంత్... జట్టును అట్టడుగున పదో స్థానంలో నిలిపాడు. అతడి సారథ్యంలో లక్నో పద్నాలుగింట కేవలం నాలుగు మ్యాచ్‌లే గెలిచి చెత్త ప్రదర్శన నమోదు చేశాడు. ఈ నేపథ్యంలో పంత్‌ను రూ. 15 కోట్లకు లక్నో ట్రేడ్ చేసింది. ఈ నేపథ్యంలో లక్నో జట్టు యజమాని సంజీవ్ గోయెంకా గతంలో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. "పంత్ లక్నోకు దాదాపు పదిహేనేళ్ల పాటు ఆడతాడు. ఈ ప్రయాణంలో కనీసం నాలుగు నుంచి ఆరు ఐపీఎల్ టైటిళ్లు సాధిస్తాడు. ముంబై, చెన్నై జట్లను విజయవంతమైన జట్లుగా ప్రజలు చూస్తారు. మహీ (ధోని), రోహిత్ శర్మ ఈ రెండు జట్లను ఉన్నత శిఖరాలకు చేర్చారు. పదేళ్ల తర్వాత మహీ, రోహిత్ తర్వాత రిషభ్ పేరునే అందరూ చెప్తారు. నా మాటలు రాసిపెట్టుకోండి" అంటూ సంజీవ్ గోయెంకా పంత్‌ను ఆకాశానికెత్తాడు.

# స్పోర్ట్స్

## టెస్టు కెప్టెన్సీకి టైమొచ్చింది.. స్వదేశంలో ఎంగరవాకు తొలి పరీక్ష..!




జింబాబ్వేకు వన్డేల్లో సారథ్యం వహిస్తున్న రిచర్చ్ ఎంగరవా టెస్టుల్లోనూ జట్టును నడిపించనున్నాడు. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో ఏకైక టెస్టుకోసం స్క్వాడ్‌ను ప్రకటించిన సెలెక్టర్లు ఎంగరవాను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడికిదే తొలి పరీక్ష. స్వదేశంలో జూన్ 28న మొదలయ్యే ఈ మ్యాచ్‌తో జట్టును గెలుపు దిశగా నడిపించేందుకు సిద్ధమవుతున్నాడీ పొడగరి పేసర్. ఏకైక టెస్టుకోసం ఎంపిక చేసిన 15మంది బృందంలో స్టార్ ఆల్‌రౌండర్ సికిందర్ రజాకు చోటు దక్కలేదు. ఇంగ్లండ్ వేదికగా జరిగే కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఆడేందుకు రజా కట్టుబడి ఉండడంతో అతడిని పక్కన పెట్టేశారు. నిరుడు ఏప్రిల్ -- మే నెలలో జింబాబ్వే, బంగ్లాదేశ్ రెండు టెస్ట్‌ల్లో తలపడ్డాయి. తొలి మ్యాచ్‌లో జింబాబ్వే మూడు వికెట్ల విజయం సాధించింది. కానీ, రెండో మ్యాచ్‌లో గెలుపొందిన బంగ్లా సిరీస్‌ను సమం చేసి పరువు కాపాడుకుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఇరుజట్లు ఏకైక టెస్టులో విజయంపై కన్నేశాయి. జూన్ 28న హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో మ్యాచ్ జరుగనుంది. జింబాబ్వే స్క్వాడ్ : రిచర్డ్ ఎంగరవా(కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, తనకా చివంగా, గ్రేమీ క్రెమర్, క్రేగ్ ఎర్విన్, బ్రాడ్ ఎవాన్స్, ఇన్నోసెంట్ కైయా, రాయ్ కైయా, వెస్లీ మధెవెరె, తడివనషె మరుమని, బ్లెస్సింగ్ ముజరబని, న్యూమాన్ న్యామ్‌హూరి, బ్రెండన్ టేలర్, తఫడ్జ్వ త్సిగా.




# ‘స్టూడెంట్’గా మేఘాంశ్ శ్రీహరి.. ఫస్ట్ లుక్ వైరల్

రాజ్‌దూత్, కోతి కొమ్మచ్చి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు దివంగత నటుడు, రియల్ స్టార్ శ్రీహరి కుమారుడు మేఘాంశ్ శ్రీహరి. లాంగ్ గ్యాప్ తర్వాత కొత్త సినిమాతో అప్‌డేట్‌తో హాయ్ చెప్పాడు. మేఘాంశ్ శ్రీహరి హీరోగా నటిస్తోన్న చిత్రం స్టూడెంట్ బాలు తత్వమసి డైరెక్ట్ చేస్తున్నఈ మూవీ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో మేఘాంశ్ శ్రీహరి డ్రాయింగ్ లుక్ కనిపిస్తుండగా.. బ్యాక్ డ్రాప్‌లో పేపర్‌పై కొన్ని కొటేషన్లను గమనించవచ్చు. ధైర్యం కలిగిన ఒక్క వ్యక్తి మెజారిటీ అవుతాడు.. మెంటల్ మాస్ తుఫాన్ రాబోతుందంటూ రిలీజ్ చేసిన లుక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమా హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.



# 2027 ప్రభాస్ నామ సంవత్సరం.. ఒకటి కాదు మూడు భారీ ట్రీట్స్ ప్లాన్ చేస్తున్న రెబల్ స్టార్

ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. ‘బాహుబలి’ తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన ‘రాజా సాబ్’ సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘ఫౌజీ’పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం ‘ఫౌజీ’ 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న ‘స్పిరిట్’ ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు ‘బాహుబలి’ ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం ‘బాహుబలి: ది ఎటర్నల్ వార్’ కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ‘బాహుబలి’ ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో ‘ఫౌజీ’ కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ లభించినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు ‘ప్రభాస్ నామ సంవత్సరం’గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ‘స్పిరిట్’, ‘ఫౌజీ’, ‘బాహుబలి: ది ఎటర్నల్ వార్’ చిత్రాలు ఒకే ఏడాదిలో విడుదలైతే భారతీయ సినీ పరిశ్రమలోనే అరుదైన రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం ఈ ప్రాజెక్ట్‌ల అధికారిక విడుదల తేదీలపైనే ఉంది.

# రూ. 50 కోట్ల క్లబ్బులోకి ‘మా ఇంటి బంగారం’



బాక్సాఫీస్ వద్ద ‘మా ఇంటి బంగారం’ రికార్డులు సృష్టిస్తోంది. దాదాపు మూడేళ్ల గ్యాప్ తర్వాత సమంత నటించిన చిత్రమిది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సమంత భర్త రాజ్ నిడిమోరు కథ, కథనం అందించడంతో పాటు నిర్మాతగానూ వ్యవహరించాడు. భారీ అంచనాలతో ఈ నెల 19న విడుదలైన ఈ మూవీ తొలి రోజు మిక్స్‌డ్ టాక్ సంపాదించుకుంది. రెండో రోజు నుంచి నెమ్మదిగా పుంజుకొని వీకెండ్‌లో భారీ కలెక్షన్స్ రాబట్టింది. ఫ్యామిలీ ఆడియన్స్, ముఖ్యంగా మహిళలు ఈ చిత్రంపై ఆసక్తిని కనబరుస్తున్నారు. తొలి రోజు ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 కోట్లకు పైగా వసూలు చేసింది. ఇక కేవలం నాలుగు రోజుల్లోనే హాఫ్ సెంచరీ(రూ.50 కోట్లు) కొట్టి రికార్డు క్రియేట్ చేసింది. నాలుగు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రూ. 50 కోట్ల వసూలు వచ్చినట్లు మేకర్స్ ప్రకటించారు. ఇక ఈ చిత్రానికి రూ. 30 కోట్ల బడ్జెట్ అయినట్లు సమచారం. ఇప్పటికే ఓటీటీ, శాటిలైట్స్, ఆడియో రైట్స్ రూపంలో రూ. 35 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక థియేటర్స్‌లోనూ భారీ కలెక్షన్స్ రాబడుతోంది. మొత్తంగా గ్యాప్ తీసుకొని వచ్చిన సమంతకు ‘మా ఇంటి బంగారం’తో భారీ బ్లాక్ బస్టర్ దక్కింది.

# ‘పెద్ది’ తర్వాత మారిన బుచ్చిబాబు ప్లాన్ .. ఇక లాంగ్ గ్యాప్‌లకు గుడ్‌బై



టాలీవుడ్‌లో దర్శకుడు బుచ్చిబాబు సాన గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకొచ్చేది ఆయన కథలపై చూపించే నిబద్ధత. ఒక సినిమా పూర్తయిన వెంటనే మరో ప్రాజెక్ట్‌ను ప్రారంభించే దర్శకుల కంటే, కథను పూర్తిగా సిద్ధం చేసి, ప్రతి అంశాన్ని పక్కాగా మలిచిన తర్వాతే సెట్స్‌పైకి తీసుకెళ్లే దర్శకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఇప్పుడు బుచ్చిబాబు తన పని విధానంలో కీలకమైన మార్పుకు సిద్ధమవుతున్నారనే చర్చ ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. ‘ఉప్పెన’ సినిమాతో దర్శకుడిగా అద్భుతమైన అరంగేట్రం చేసిన బుచ్చిబాబు తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్నారు. అయితే ఆ సినిమా తర్వాత వెంటనే కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించకుండా, తన రెండో చిత్రానికి అవసరమైన కథ, పాత్రలు, ప్రీ-ప్రొడక్షన్ పనులపై చాలా సమయం కేటాయించారు.వీశీజఱవం దీంతో ‘ఉప్పెన’ తర్వాత ఆయన తదుపరి చిత్రం కోసం అభిమానులు, సినీ పరిశ్రమ దాదాపు కొన్ని సంవత్సరాలు ఎదురుచూడాల్సి వచ్చింది. చివరకు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన ‘పెద్ది’ ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని అందుకుంది. ‘పెద్ది’ విజయం బుచ్చిబాబు కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలిచింది. గ్రామీణ నేపథ్యం, భావోద్వేగాలతో కూడిన కథనం, పాత్రల రూపకల్పన, విజువల్ ట్రీట్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆయన కథ చెప్పే తీరు, భావోద్వేగాలను తెరపై ఆవిష్కరించే విధానానికి విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. అయితే ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ‘పెద్ది’ తర్వాత బుచ్చిబాబు గతంలా సంవత్సరాల తరబడి విరామం తీసుకోవాలని భావించడం లేదట. కొంతకాలం విశ్రాంతి తీసుకున్న తర్వాత వెంటనే కొత్త కథలపై దృష్టి పెట్టాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. స్టోరీ డెవలప్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేసి, గతంతో పోలిస్తే చాలా తక్కువ సమయంలోనే తన తదుపరి సినిమాను ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ తీవ్రంగా పెరిగింది. ఒక దర్శకుడు వరుస విజయాలను కొనసాగించాలంటే తక్కువ వ్యవధిలోనే కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటించడం కూడా కీలకంగా మారింది. ఈ విషయాన్ని బుచ్చిబాబు కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. అందుకే ఈసారి కథా రచన, ప్రీ-ప్రొడక్షన్ ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి తదుపరి సినిమాను త్వరగా పట్టాలెక్కించాలని ఆయన భావిస్తున్నారని సమాచారం. ముఖ్యంగా పలువురు స్టార్ హీరోలతో ఆయన కాంబినేషన్‌లపై సోషల్ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుతం ఆయన పూర్తిగా కొత్త కథ అభివృద్ధిపైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.



# ‘ది పారడైజ్’ రిలీజ్‌పై క్లారిటీ వచ్చినట్టేనా..

## నాని పాన్ ఇండియా మూవీకి కొత్త రిలీజ్ డేట్ టాక్!

న్యాచురల్ స్టార్ నాని హీరోగా, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘ది పారడైజ్’పై ప్రేక్షకుల్లో రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ‘దసరా’ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ఈ కాంబినేషన్ మరోసారి కలిసి పని చేస్తుండటంతో సినిమా ప్రకటించినప్పటి నుంచే భారీ ఆసక్తి నెలకొంది. అయితే ఈ చిత్రం విడుదల తేదీ విషయంలో గత కొంతకాలంగా అనేక వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 మార్చిలో విడుదల చేయాలని మేకర్స్ భావించినట్లు ప్రచారం జరిగింది. అనంతరం సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆగస్టు విడుదలకు సంబంధించి కూడా అధికారిక ప్రకటన రాకపోవడంతో సినిమా డిసెంబర్‌కు వెళ్లే అవకాశముందని సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం ‘ది పారడైజ్’ను సెప్టెంబర్ 25, 2026న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.ప్రస్తుతం ‘ది పారడైజ్’ షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాను అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని సమాచారం. ప్రతి సన్నివేశాన్ని ప్రత్యేకంగా డిజైన్ చేస్తూ, పాన్ ఇండియా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని మేకింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తోంది. సినిమా బడ్జెట్ కూడా అంచనాలను దాటి భారీ స్థాయికి చేరినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయినప్పటికీ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి నమ్మకంతో ఉన్నారట. కంటెంట్, మేకింగ్ స్కేల్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. మరోవైపు కలెక్షన్ కింగ్ మోహన్ బాబు కీలక ప్రతినాయక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్ కూడా ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు.అలాగే బాబు మోహన్, సంపూర్ణేష్ బాబు, తనికెళ్ల భరణి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ తారాగణం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి స్టార్ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘దసరా’ తర్వాత నాని–శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సంగీతం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని అభిమానులు భావిస్తున్నారు. ‘ది పారడైజ్’ను కేవలం తెలుగు సినిమా కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,